Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక


సంపుటి : 1 | సంచిక : 68 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 31 మార్చి 2023 | శుక్రవారం | పేజీలు : 4

## 80 ఏళ్లు పైబడిన వారికి ఇంటి నుంచే ఓటింగ్

న్యూఢిల్లీ: కర్ణాటకలో భారీగా వృద్ధుల ఓట్లు ఉండటంతో అసెంబ్లీ ఎన్నికల్లో 80 ఏళ్ల పైబడిన సీనియర్ సిటిజన్లకు ఇంటి వద్దే ఓటు వేసే సదుపాయం కల్పిస్తున్నట్టు భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ప్రకటించారు. దివ్యాంగులకు కూడా ఇంటివద్ద నుంచే తమ ఓటు హక్కును వినిగించుకోవచ్చని చెప్పారు. మే 10వ తేదీన అసెంబ్లీ ఎన్నికలను నిర్వహిస్తున్నట్టు మీడియా సమావేశంలో ఆయన ప్రకటించారు. మే 13వ తేదీన ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. మొత్తం 224 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎన్నికల కమిషన్ లెక్కల ప్రకారం మొత్తం 224 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎస్సీలకు 36, ఎస్టీలకు 15 రిజర్వు చేశారు. 80 ఏళ్లు పైబడిన ఓటర్లు 12.15 లక్షల మంది ఉన్నారు. మొత్తం ఓటర్లు 5.21 కోట్లు, అందులో మహిళా ఓటర్లు 2.59 కోట్ల మంది. తొలిసారిగా ఓటు హక్కు నమోదైనవారు 9.17లక్షల మంది, శతాధిక వృద్ధులు 16,976, ట్రాన్స్‌జెండర్ ఓటర్లు 4,699 మంది ఉన్నారు. 80 ఏళ్లు పైబడిన ఓటర్లు 12.15 లక్షలు, వికలాంగ ఓటర్లు 5.55 లక్షల మంది ఉన్నారు.

## రాహుల్ సీటుకు ఉప ఎన్నిక ఎప్పుడంటే..?

న్యూఢిల్లీ: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల తేదీని ప్రకటించిన ఎన్నికల కమిషన్ రాహుల్ గాంధీపై అనర్హత వేటు నేపథ్యంలో ఖాళీ అయిన కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గం ఉపఎన్నిక విషయంలో సస్పెన్స్ పాటించింది. ఫిబ్రవరి వరకూ ఉన్న వేకెన్సీలను క్లియర్ చేసినట్టు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ మీడియా సమావేశంలో తెలిపారు. వయనాడ్ వేకెన్సీని మార్చిలో నోటిఫై చేశామని, అప్పీల్ చేసుకునేందుకు 30 రోజుల సమయం ఉన్నందున తాము తొందరపడటం లేదని చెప్పారు. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951 ప్రకారం ఏ సీటైనా ఖాళీ అయితే ఆరు నెలల్లోపు దానిని భర్తీ చేయాల్సి ఉంటుందని తెలిపారు.



# మనపరిస్థితేంటి...?

## టిక్కెట్ల కోసం బిఆర్ఎస్ నేతల పడరాని పాట్లు

## కేసీఆర్ సర్వేతో వణుకు

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చే ఎన్నికల్లోనూ విజయం సాధించాలని నిర్ణయించుకున్నారు. ము చ్చటగా మూడోసారి కూడా పార్టీని అదికారంలోకి తీసుకువచ్చి.. రికార్డు సృష్టించాలని.. కేసీఆర్ నిర్ణయిం చుకున్నారు. అయితే.. వచ్చే ఎన్నికలు అంత ఈజీగా కనిపించడం లేదు. గతానికి భిన్నంగా బీజేపీ పుంజుకోవడం.. అదేసమయంలో కాంగ్రెస్ కూడా పరుగులు పెడుతుండడం సహజంగానే అధికారపార్టీని ఇర కాటంలోకి నెట్టింది. మరోవైపు.. సిట్టింగు ఎమ్మెల్యేలపై సర్వే చేయిస్తున్నారు. సిట్టింగ్ నేతల విషయంలో ప్రజలు ఏమనుకుంటున్నారు? సిట్టింగులకు మళ్లీ టికెట్లు ఇస్తే నెగ్గుతారా? లేదా..? అనే విషయంపై ప్రశాంత్ కిశోర్ సహా.. ఇతర వర్గాలతోనూ కేసీఆర్ సర్వే చేయిస్తున్నారు. అయితే.. ఈ సర్వేల ఆధారంగానే నేతలను మారుస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

సర్వేలో 90 మార్కులకు పైగా వస్తేనే.. టికెట్ మళ్లీ దక్కుతుందనే ప్రచారం ఉంది. అయితే.. ఇక్కడే సిట్టింగులు.. సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. సర్వేలో ఎంత నిజం ఉంది? అంతా సర్వేనే నమ్ముకుని.. ముందుకు సాగితే.. ఎలా? అని ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ప్రశాంత్ కిశోర్ సర్వేలకు.. ప్రాధాన్యం తగ్గిపోతోందని చెబుతున్నారు. ఇటీవల జరిగిన గోవా ఎన్నికల్లో సర్వేలు చేసిన ఆయన బీజేపీ పని అయిపోయిందని.. పశ్చిమ బెంగాల్ సీఎం.. మమతా బెనర్జీకి చెందిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేస్తుందని తేల్చిచ్చెప్పారు. దీంతో అక్కడ మమత పార్టీ నేతలు.. కోట్ల రూపాయలు వెదజల్లి మరీ.. ప్రచారం చేశారు. కానీ తీరా చూస్తే.. ఒక్కరంటే ఒక్కరు కూడా నెగ్గలేదు. ఇక యూపీలోనూ కాంగ్రెస్ పుంజుకుంటుందని.. 50 స్థానాలుదక్కించుకుంటుందని చెప్పిన పీకే.. సర్వే ఫెయిల్ అయింది. వీటిని పరిగణనలోకి తీసుకుంటున్న టీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు.. మధన పడుతున్నారు. ఆయన(పీకే) బృందం ఎవరిని కలుస్తోందో.. ఎవరితో మాట్లాడుతోందో.. తెలియదు. మా వరకు మేం బాగానే ప్రజల మధ్య ఉంటున్నాం. అయినప్పటికీ.. సీఎం కేసీఆర్ కూడా.. కేవలం సర్వేలపైనే ఆధారపడడం కాకుండా.. ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించాలి. ప్రతి ననియోజకవర్గంలోనూ.. అధికారులు మేము కలిసి చేస్తున్న పనులపై నివేదికలు తెప్పించుకుని పరిశీలించాలి. కేవలం పీకే సర్వేతోనే ఆధారపడితే.. మా లాంటి నిజాయితీగా పనిచేసే నాయకులకు అన్యాయం జరిగినట్టే! అని కరీం నగర్ కు చెందిన ఒక ఎమ్మెల్యే మీడియా ముందు ఆఫ్ ది రికార్డుగా వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అంటే.. దాదాపు సగం మంది ఎమ్మెల్యేల్లో ఇదే వాదన వినిపిస్తోంది. కేసీఆర్ స్వయంగా వచ్చి..చూడాలని.. అప్పుడు ఎమ్మెల్యేల పనితీరును నిర్ణయించాలని. కోరుతున్నారు. మరి కేసీఆర్ సార్కు అంత సమయం ఉంటుందా? ఉండదా? అనేది చూడాలి.




## పండగ వేళ విషాదం: ఆలయంలో మెట్లబావిలో పడిన భక్తులు.. 8 మంది మృతి

ఇండోర్: మధ్యప్రదేశ్‌లో శ్రీ రామనవమి వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. ఓ ఆలయంలో మెట్లబావి పైకప్పు కూలి.. అందులో భక్తులు పడిపోయారు. ఇండోర్‌లో జరిగిన ఈ దుర్ఘటనలో ఎనిమిది మంది భక్తులు ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడ్డారు. పటేల్ నగర్ ప్రాంతంలోని మహదేవ్ జులేలాల్ ఆలయంలో రామనవమి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ వేడుకలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. స్థలాభావం కారణంగా కొందరు ఆలయ ప్రాంగణంలో ఉన్న మెట్లబావి పైనున్న ఫ్లోరింగ్‌పై కూర్చున్నారు. అయితే, బరువు ఆపలేక ఆ ప్రాంతం ఒక్కసారిగా కుంగిపోయి ఫ్లోరింగ్ కూలిపోయింది. దీంతో దాదాపు 30 మంది భక్తులు అందులో పడిపోయారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయకచర్యలు చేపట్టారు. నిచ్చెన సాయంతో కొందరు భక్తులను బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎనిమిది మంది భక్తులు ప్రాణాలు కోల్పోయినట్లు ఇండోర్ పోలీసులు వెల్లడించారు. మరో 17 మందిని రక్షించారు. వారికి గాయాలవ్వడంతో ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బావి లోతు 50 అడుగుల పైనే ఉన్నట్లు తెలుస్తోంది.

## కాంగ్రెస్ ను కేసీయార్ ఇరకాటంలో పడేశారా ?



హైదరాబాద్ : బీఆర్ఎస్ విషయంలో కాంగ్రెస్ నేతల్లో అయోమయం పెరిగిపోతున్నట్లుంది. కాంగ్రెస్ పార్టీకి కేసీయార్ ప్రత్యర్థా ? శతృవు లేకపోతే మిత్రుడా అనే విషయాన్ని తెలంగాణా హస్తం పార్టీ నేతలు తేల్చుకోలేకపోతున్నారు. ఈ అయోమయం నుండి బయటపడలేకే మూడురోజులుగా కేసీయార్ ను టార్గెట్ చేయటం తగ్గించేశారు. దీనికి ప్రధాన కారణం ఏమిటంటే రాహుల్ గాంధీపై ఎంపీగా అనర్హత వేటు వేయటాన్ని కేసీయార్ తప్పుపట్టడమే. రాహుల్ అంశంపై ఢిల్లీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో బీఆర్ఎస్ ఎంపీలు కూడా పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొనటమే కాకుండా రాహుల్ కు సంఘీభావంగా జరిగిన మార్చ్ ఫాస్ట్ లో కూడా పార్టిసిపేట్ చేశారు. అలాగే రాహుల్ కు మద్దతుగా కేసీఆర్... నరేంద్రమోడీ బీజేపీ పై విరుచుకుపడుతున్నారు. ఒకవైపు కేసీయార్ తమ అగ్రనేత రాహుల్ కు మద్దతుగా మాట్లాడుతుంటే తెలంగాణాలో తాము కేసీయార్ విషయంలో ఎలాంటి వైఖరి అవలంభించాలో కాంగ్రెస్ నేతలకు అర్థం కావటం లేదు. ఒకపుడు పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితో పాటు చాలామంది ప్రతిరోజు కేసీయార్ ను టార్గెట్ చేస్తుండేవాళ్ళు. అలాంటిది ఎప్పుడైతే రాహుల్ కు కేసీయార్ మద్దతు పలికారో అప్పటినుండి తెలంగాణా కాంగ్రెస్ లో సీన్ మారిపోయింది. వారం రోజులుగా లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా నరేంద్రమోడీపై ఆరోపణలు విమర్శలతో రెచ్చిపోతున్నారు కాంగ్రెస్ నేతలు. మామూలుగా అయితే ఇటు నరేంద్ర మోడీతో పాటు అటు కేసీయార్ ను కూడా కలిపి రేవంత్ అండ్ కో వాయించేస్తుండేది. అలాంటిది ఇపుడు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నా అదంతా కేవలం నరేంద్ర మోడీ బీజేపీకి వ్యతిరేకంగా మాత్రమే జరుగుతోంది. ఆరోపణలు విమర్శలను మోడీకి మాత్రమే పరిమితం చేస్తున్నారు. మరి కేసీయార్ ను ఎందుకు వదిలిపెడుతున్నారంటే కాంగ్రెస్ నేతలు ఎవరూ సమాధానం చెప్పలేకపోతున్నారు. మొత్తానికి ఇపుడు జరుగుతున్న పరిణామాలు కాంగ్రెస్ కు ప్లస్సవుతాయా లేకపోతే మైనస్సవుతాయా కూడా ఎవరు ఊహించలేకపోతున్నారు. ఎన్నికలేమో మరో తొమ్మిది నెలల్లో ఉన్నాయి. ఈ సమయంలో కాంగ్రెస్ లో ఇలాంటి కన్ఫ్యూజన్ ఏమాత్రం మంచిది కాదని అందరికీ తెలిసిందే. మరి చివరకు ఏమి జరుగుతుందో చూడాల్సిందే.



# మార్చి చివరికే మండేస్తుంది...!

## ఎండ దెబ్బకు బయటికి రావాలంటేనే భయపబడుతున్న జనాలు

హైదరాబాద్ : ఎండలు ముదురుతున్నాయి. రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. రంగారెడ్డి జిల్లాలో గత రెండు మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. సోమవారం గరిష్ఠంగా 36.7, మంగళవారం 36.5, బుధవారం గరిష్ఠ ఉష్ణోగ్రత 35.1 నమోదైంది.

ఉదయం తొమ్మిది గంటలు దాటిందంటే భానుడు భగభగ మండుతుండటంతో రోడ్లన్నీ వెలవెలబోతున్నాయి. ఇప్పటికే ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తుండగా ..అటు ఉక్కపోత నుం చి ఉపశమనం పొందేందుకు కూలర్లు, ఏసీలను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు 30-35 డిగ్రీల వరకు నమోదు కాగా, రాత్రి ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకు పైగా ఉంటున్నాయి.

**ఎండలతో ఉక్కిరిబిక్కిరి..** మొన్నటి వరకు చలితో సతమతమైన ప్రజలు ప్రస్తుతం ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. భానుడు మార్చి నెలలోనే భగ్గుమంటున్నాడు. దీంతో ఉష్ణోగ్రత లు క్రమంగా పెరుగుతున్నాయి. వారం రోజుల క్రితం తీవ్ర చలిగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా వేడెక్కడం తో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. మధ్యాహ్నం పూట భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండటంతో ప్రజలు బయటికి వెళ్లేందుకు జంకుతున్నారు. ఉదయం, రాత్రి వేళల్లో చలిప్రభావం ఉన్నప్పటికీ మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత పెరుగుతున్నది. రోడ్లు నిర్మాను ష్యంగా మారుతున్నాయి. పెండ్లిళ్ల సీజన్ కావడంతో ప్రజలు తలకు టవల్, టోపీలు, గొడుగులు ధరించి కనపడుతున్నారు. పనుల నిమిత్తం బయటికి వెళ్లాల్సి వస్తే ఉద యం, సాయంత్రం వేళలను ఎంచుకుంటున్నారు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగి ఎండలు మండుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడే ఈ స్థాయిలో ఉంటే రానున్న ఏప్రిల్, మే నెలల్లో ఎం డల తీవ్రత ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతు లు, కూలీలు ఎండల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు కొబ్బరి బొండాలు, నిమ్మకాయ పానీయాలు, లస్సీ, పండ్ల రసాలు తాగుతున్నారు.

**ఏప్రిల్, మే నెలల్లో..** ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలతోపాటు రోహిణి కార్తెలో ఎండలు ఎక్కువగా ఉండే అవకాశం కనిపిస్తున్నది. రాత్రి పూట చలి, మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. ప్రతిరోజూ భిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో వైరల్ జ్వరాలు పెరిగాయి. జ్వరం, దగ్గు, ఒంటి నొప్పులు, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలతో చాలామంది ఇబ్బంది పడుతున్నారు. దినసరి కూలీలు ఉదయం సమయంలోనే పనులను పూర్తి చేసుకుని మధ్యాహ్నంలోగా ఇంటికి చేరుకోవాలని వైద్య నిపుణు లు సూచిస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో బయటికి వెళ్లాల్సిన వారు తప్పకుండా గొడుగులు వెంట తీసుకెళ్లాలని చెబుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలని.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచిస్తున్నారు. వడగాడ్పులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో మధ్యాహ్నం బయటికి వెళ్లకపోవడమే ఉత్తమమని పేర్కొంటున్నారు.

**ప్రజలు జాగ్రత్తలు పాటించాలి :** ఎండల తీవ్రత పెరుగుతున్నది. ప్రజలు మండుటెండల్లో బయట తిరగొద్దు. వేడి గాలులతో వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంది. పనులుంటే ఉదయం, సాయంత్రం సమయాల్లో పూర్తి చేసుకోవాలి. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతుండటంతో చిన్న పిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు పాటించాలి. బయటకెళ్లే సమయంలో గొడు గును వెంట తీసుకెళ్లాలి.

**-డాక్టర్ దామోదర్, ఉప వైద్యాధికారి రంగారెడ్డి జిల్లా**

# సంపాదకీయం

## డొల్ల కంపెనీలతో చైనా వాళ్ళు మనీల్యాండరింగ్ ?

మనదేశంలో డొల్ల కంపెనీలు పెట్టి చైనా వాళ్ళు మనీల్యాండరింగ్ చేస్తున్నారా ? రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీ (ఆర్వోసీ) వర్గాల ప్రకారం అవుననే సమాధానం వస్తోంది. కొన్ని లావాదేవీలపై అనుమానం వచ్చిన ఆర్వోసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు రంగంలోకి దిగి తీగ లాగితే డొంకంతా కదులుతోంది. ఇప్పటివరకు మనీల్యాండరింగ్ చేస్తున్న 500 చైనా కంపెనీలను గుర్తించారు. ఈ డొల్ల కంపెనీల్లో చైనా వాళ్ళతో పాటు స్థానికంగా మన వాళ్ళను కూడా కొందరిని డైరెక్టర్లు పెట్టుకుంటున్నారు. ఇలాంటి డొల్ల కంపెనీలు ఏపీలో 4 తెలంగాణలో 12 కర్ణాటకలో 197 తమిళనాడు మహారాష్ట్రలో కూడా ఉన్నట్లు లెక్క తేలింది. ఏపీలో ఆర్వోసీ అధికారులిచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. దీంతో చిత్తూరు జిల్లాలోని శ్రీ సిటీ అడ్రస్ మాత్రమే కరెక్టని తేలింది. మిగిలిన మూడు కంపెనీల అడ్రస్సులు బోగస్ అని తేలింది. శ్రీ సిటీ లో కూడా అడ్రస్ మాత్రమే కరెక్టని మిగిలిందంతా డొల్ల వ్యవహారమేనట. ఏవో పేర్లతో కంపెనీలు రిజిస్టర్ చేయటం చైనా నుంచి ముడిసరుకులు తెప్పించుకుంటున్నట్లు ఇన్వాయిస్ లు సృష్టించటం డబ్బులు చెల్లిస్తున్నట్లు బిల్లులు కూడా సృష్టిస్తున్నారు. అయితే సరుకు రాకుండానే డబ్బులు చెల్లిస్తున్నారు. దీంతో ఇన్వాయిసులు బిల్లులంతా బోగస్ అని అర్థమైపోయింది. కేంద్ర కార్పొరేట్ మంత్రిత్వ శాఖ వర్గాల ప్రకారం చైనా మనదేశంలో 500 కంపెనీలు రిజిస్టర్ చేసి మనీ ల్యాండరింగ్ కు పాల్పడుతోందట. ఇండియా డైరెక్టర్లుగా నియమించుకున్న స్థానికులకు నెలకు రు. 10 వేలు చెల్లిస్తోంది. స్థానిక డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్న వారందరినీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వీళ్ళలో ఎవరికి కూడా కంపెనీల కార్యకలాపాలతో ఎలాంటి సంబంధం లేదని అర్థమవుతోంది. చైనా వాళ్ళు డొల్ల కంపెనీల ఏర్పాటుకు సహకరించిన కంపెనీ సెక్రటరీలు చార్టెడ్ అకౌంటెంట్లు ఆర్వోసీ అధికారులపైన కూడా పోలీసులు కేసులు నమోదు చేశారు. కంపెనీలు రిజిస్టర్ చేసుకుంటున్నట్లు దరఖాస్తుల్లో చెప్పిన అడ్రసులు చాలావరకు బోగస్ అని గుర్తించారు. దర్యాప్తు పూర్తిగా జరిగితే ఇంకెన్ని నిజాలు బయటపడతాయో చూడాలి.

# ఎక్సైజ్ అధికారులా మజాకా!

భద్రాచలం : జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి వి.శ్రీనివాసగౌడ్, రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సహా పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో అట్టహాసంగా నాటించిన మొక్కలు 20రోజులైనా గడవకముందే మాయమయ్యాయి. ఘనత వహించిన ఎక్సైజ్ అధికారులే పదిరోజులు తిరగకుండానే ఆమొక్కలను తొలగించి తరలించుకుపోయారనే విమర్శలున్నాయి. మొక్కలు నాటించిన విధానంపైనే ఎక్సైజ్ అధికారులే అభాసుపాలయ్యారు. ఆ తర్వాత జరిగిన తతంగం వారి పనితీరుపై వచ్చిన విమర్శలు నిజమయ్యాయి.

గతనెల 13న మంత్రులు శ్రీనివాసగౌడ్, అజయ్‌కుమార్ పర్యటించారు. వైరా రిజర్వాయర్‌లో స్పీడ్ బోటును ప్రారంభించారు. రిజర్వాయర్ ఆనకట్ట పైభాగంలో ఎక్సైజ్‌శాఖ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటుచేసింది. మొక్కల కోసం ఎంపిక చేసిన స్థలం రిజర్వాయర్ పటిష్టతకు హానికరంగా ఉందనే విమర్శలొచ్చాయి. అయినప్పటికీ ఎక్సైజ్ అధికారులు, ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యే రాములునాయక్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, కలెక్టర్ గౌతమ్ సహా పలువురు అధికారులతో మొక్కలు నాటించారు. వీటిపైనే సర్వత్రా విమర్శలొచ్చాయి. వాటిని పోషించి రక్షిస్తారని అందరూ భావించారు. అయితే అందుకు విరుద్ధంగా నాటిన పదిరోజుల తర్వాత ఎక్సైజ్‌శాఖ వారే ఆమొక్కలను పీకివేసి బయటకు తరలించుకుపోయారు. ప్రస్తుతం మొక్కలు నాటి పీకేసిన తర్వాత మిగిలిన గుంతలు మాత్రం దర్శనమిస్తున్నాయి. మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను సైతం అవమానించి పక్కదారి పట్టించి అభాసుపాలుచేసిన ఎక్సైజ్ అధికారులపై తగు చర్యలు తీసుకొని భవిష్యత్‌లో ఇలాంటివి జరుగకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# అంచనా తప్పిందా?



భద్రాచలం : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ఉన్న ఏకైన భూగర్భ గని కొండాపురం అండర్ గ్రౌండ్‌మైన్ మూసివేతకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. పగిడేరు పంచాయతీ శివారు అటవీ ప్రాంతంలో దాదాపు 477 హెక్టార్లల్లో సెమీ మెకనైజేషన్ విధానం ద్వారా 2015 లో ఈ గనిని ప్రారంభించారు. 21ఏళ్ల కాలపరి మితితో ఈ గని రూపకల్పన చేశారు. ఏరియాలోనే మేలైన ఎఫ్-6 గ్రేడ్ బొగ్గు ఇందులో లభ్యమవుతుందని సుమారు రూ.20 కోట్లను ఖర్చుచేసి ఈ గని ఏర్పాటు చేశారు. అయితే సాంకేతిక కారణాల వల్ల యాజమాన్యం ప్రస్తుతం ఈ గనిని మూసివేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. గనిలో ఉత్పత్తయ్యే బొగ్గు మేలురకానిదే అయినా గని బౌగోళిక పరిస్థితులు ఇందుకు సహకరిం చకపోతుం డటంతో ఉత్పత్తి అనితర సాధ్యంగా మారినట్లు తెలిసింది. ఓసీ గనుల మధ్య ఉన్న ఈ యూజీ గనికోసం కంపెనీ కోట్ల రూపాయాలను వెచ్చించింది. ఈ గని ద్వారా ఎక్కు వ మంది కార్మికులకు ఉపాధిని కల్పించా లన్న లక్ష్యంతో మణుగూరు ఏరియా నుంచి గతంలో గోదావరిఖని, భూపాల పల్లి, వంటి సుదూర ప్రాంతాలకు బదిలీ అయిన కార్మికులను నాడు ఉద్యమాలు నిర్వహిం చిన కార్మిక సం ఘాల ఒత్తిడి మేరకు తిరిగి ఇక్కడికి తీసుకువచ్చి ఉపాదిని చూపారు. అయితే ఈ గని ప్రారంభించిన నాటి నుంచి అనేక అవాంతరాలు ఎదుర వుతూనే ఉన్నాయి. ప్రధాన గని పైభాగాన గొర్రెపేట వాగు ఉండటం వల్ల దాని మళ్లింపునకు సింగరేణి లక్షలాది రూపాయలు ఖర్చు చేసింది. వాగులోని నీరు వర్షాకా లంలో భూపొర ద్వారా గనిలోకి ఇంకే ప్రమాదం ఉండడంతో యాజ మాన్యం దీనికి ఎన్నో ప్రత్యామ్నాయ ఏర్పా ట్లు చేసింది. వాగును మళ్లించేందుకు భగీరథ ప్రయత్నం చేసి వాగు దారి మళ్లించారు. గనిలో కూడా పలుచోట్ల పైపులైన్లు వేశారు. ఈ గనిలో ఓబీ పనుల నిర్వహణ మొదటి నుంచి ఎస్ఎంఎస్ అనే కంపెనీ చేపడుతున్నా ప్రస్తుతం సూ చించిన పని పదేశాల్లో ముందుకు సాగలేని పరిస్థితులు నెలకొన్నట్లు సమాచారం. దాంతో బండలను తొలగిచడం ఇక తమవల్ల కాదని సదురు కంపెనీ నిర్వాహ కులు చే తులెత్తేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే తమకు సం బంధించిన సామగ్రి, యంత్రాలను కూడా గని బయటికి తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయంపై సింగరేణి అధికారులు రెండు నెలలుగా తర్జన భర్జన పడుతున్నారు. గనిలో అంచనాలకు మించి బండలు ఎస్ఎస్ఎం కంపెనీ నిర్వాహకులకు పనిప్రదేశాల్లో ఎదు రైన బండలను తొలచడం సాధ్యం కావడం లేదని తెలు స్తోంది. సర్వేలో చూపిన దానికంటే ఇంకా ఎక్కువ లోతుకు వెళ్లినా బండనే ఉంది తప్ప బొగ్గు పొరలు కనిపిం చ డం లేదని సమాచారం. దీంతో ఆ కంపెనీ తమ ఒప్పం దాల ప్రకారం మాత్రమే పనులు సా?గించి చివరికి చేసేదే మీ లేక తపుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే తమ యంత్రాలన్నీ బావి నుంచి బయ టికి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ప్రణాళికా లోపంతో రూ.కోట్లు వృథా21 ఏళ్ల కాలపరిమితితో ప్రణాళికలు రూపొందించిన ఈ గని అంచనాలు తప్పినట్లు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ఎందుకు ఫలి తం దక్కలేదన్న విషయంపై చర్చ జరుగుతోంది. గనిలో బొగ్గు పొరలపై అధికారుల నివేదికలు సరిగా లేవన్న అ నుమానాలు స్థానికంగా వ్యక్తమవుతు న్నాయి. లేకపోతే ఉన్న ఏకైన భూగర్భగనిని మూసివేసి ఓపెన్‌కాస్టుపై దృష్టి పెట్టే ఆలోచనలో సింగరేణి అధికారులు ఉన్నారా అన్న అ నే విషయంపై కూడా చర్చ జరుగుతోంది. పొరపాటు ఎ క్కడ జరిగిందనే విషయం మాత్రం అంతా గోప్యత పా టిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ యూజీమైన్ ఓసీగా రూ పాంతరం చెందితే కార్మికుల భవితవ్యం ఏంటనేది ప్ర శ్నార్థకంగా మారింది. ఓసీల్లో అంతా యంత్రాలపై ఆధా రపడి ఉత్పత్తి తీసే పరిస్థితులు ఉంటే ఇక్కడి కార్మికులను ఎక్కడికి బదిలీ చేస్తారనే విషయమై కార్మిక వర్గంలో ఇప్ప టి నుంచే ఆందోళన మొదలైంది. ఏది ఏమైనా జరిగిన పొరపాట్లకు ఎవరు బాధ్యత వహిస్తారు. కోట్లాది రూపా యల సింగరేణి ధనం వృథాపై అధికారులు ఏం చెబుతా రనే దానిపై ప్రస్తుతం ఆసక్తి నెలకొంది.

# రుణాల కోసం ఎదురుచూపులు

నిర్మల్ : సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన ఎస్సీ కులాల ను ఆదుకునేందుకు ప్రభుత్వం అమలు చేస్తు న్నసంక్షేమ పథకాలు ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదన్న ఆరోపణలు వె ల్లువెత్తుతున్నాయి. అట్టహాసంగా ప్రకటించిన దళితబస్తీ పథకం కనీసస్థాయిలో కూడా నిరుపేద ఎస్సీలకు లబ్ధిచేకూర్చలేదన్న ఫి ర్యాదులున్నాయి. పేదఎస్సీ కుటుంబానికి దళితబంధు కింద మూడు ఎకరాల భూమిని కేటాయించి ఆ భూమిని సాగుకు యోగ్యంగా తీర్చిదిద్దే బాధ్యతను కూడా ప్రభుత్వమే చేపట్టింది. అయినప్పటికీ ఆ పథకం కేవలం కొంతమందికి మాత్రమే వర్తింపజేసి క్షేత్రస్థాయిలోని భూసేకరణ పరిస్థితులు ఎప్పటికప్పుడు నిధుల కేటాయింపు జరగకపోవడం లాంటివి ఈ పథకాన్ని నీరుగార్చయన్న అభిప్రాయాలున్నాయి. అయితే ఓ వైపు ఈ పథకంపై నీలినీడలు కమ్ముకోగా మరోవైపు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దళితబందు పథకాన్ని తెరపైకి తెచ్చింది. ప్రతిదళిత కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున అందించనున్నట్లు ప్రకటించింది. దీని కోసం గానూ ప్రతి నియోజకవర్గంలో వందమంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే ఈ పథకంకు సంబందించిన పూర్తిస్థాయి నిధులు మంజూరు కావ డం లేదు. ఈ పథకాలన్నింటినీ అమలు చేయాల్సిన ఎస్సీ కా ర్పొరేషన్ ప్రతీ యేటా నిధుల కొరతతో సతమతమవుతోంది. ప్రధానంగా ఎస్సీ కులాల వారికి ఉపాధి కల్పించేందు కోసం చేపట్టిన రుణాల పంపిణీ పథకం నిధుల కొరత కారణంగా నీరుగారిపోతోందంటున్నారు. రుణాల కోసం గత ఏడెనిమిదేళ్ల నుంచి వందలాది మంది ఎస్సీలు ఎస్సీ కార్పోరేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ప్రతియేటా రుణలక్ష్యానికి అనుగుణంగా ఎస్సీ కార్పోరేషన్ అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించడం పరిపాటిగా మారింది. అయితే దరఖాస్తులు చేసుకున్న వారు రుణాల కోసం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఆలిసిపోతున్నారు. ప్రతీయేటా ఇలాంటి తంతు సంబంధిత అధికారులకు తలవంతపులు తెస్తోందంటున్నారు. అయితే మంజూరులు ఘనంగా ఉంటున్నప్పటికి నిధుల విడుదల విషయంలో తాత్సరం జరుగుతుండడం విమర్శలకు తావిస్తోంది. 2014 – 2015 నుంచి మొదలుకొని ఇప్పటి వరకు వేలాది మంది రుణాల కోసం దరఖాస్తులు చేసుకోగా వీరిలో కొంతమందికి మాత్రమే రుణాలు అందిస్తున్నట్లు చెబుతున్నారు. ఓ ఆర్థిక సంవత్సరంలో దరఖాస్తులు చేసుకున్న వారి దరఖాస్తులను వచ్చే సంవత్సరం కోసం పార్వార్డ్ చేయడం రివాజుగా మారిందంటున్నారు. కాగా 2020 –2021 సంవత్సరంలో మొత్తం రుణాల బడ్జెట్ 5.04కోట్లు కాగా వీటిలో నుంచి కొద్ది మందికి కూడా రుణాలు అందలేదంటున్నారు. నైపుణ్యం లేని పనులకు 2.52 కోట్లు కేటాయించగా, నైపుణ్యంతో కూడిన పనులకు కూడా 2.52 కోట్లను కేటాయించారు. అయితే నైపుణ్యం ఉన్న పనుల ఉపాధి కోసం 1750 మంది దరఖాస్తులు చేయగా ఇందులో నుంచి కేవలం 24 మందిని మాత్రమే ఎంపిక చేయడం నిధుల కొరత తీవ్రతను వెల్లడిస్తోందంటున్నారు. ఇంతమంది కోసం 71.34 కోట్లను మంజూరు చేయాల్సి ఉండగా ప్రభుత్వం కేవలం ఈ ఏడా ది టార్గెట్ పేరిట 2.52 కోట్లను మాత్రమే కేటాయించింది. దీంతో మిగతా దరఖాస్తులన్నింటినీ రాబోయే ఆర్థిక సంవత్సరం కోసం ఫార్వార్డ్ చేసి సంబంధిత అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటి కే ప్రతిపక్షాలు, దళిత సంఘాల బాధ్యులు పేదలకు రుణాలు అందించే విషయంలో చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నీరుగారిన దళితబస్తీనిరుపేద ఎస్సీ కుటుంబాలను ఆదుకునేందుకు అమలు చేసిన దళిత బస్తీ పథకం ఆఛరణలో నీరుగారిపోయిన సంగతి తెలిసిందే. నిర్మల్ జిల్లాలో ప్రతియేటా దళిత బస్తీ కోసం చాలా కుటుంబాలు ఎస్సీ కార్పోరేషన్‌కు దరఖాస్తులు చేసుకున్నాయి. అయితే వీరిలో నుంచి ఒకరిద్దరికి మాత్రమే భూములు పంపిణీ చేసి మిగతా వారి దరఖాస్తులను చెత్తబుట్టలో పాడేస్తున్నారన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం క్షేత్రస్థాయి పరిస్థితులు, ఆచరణకు సంబంధించిన అంశాలను పరిగణలోకి తీసుకోకపోవడంతో దళితబస్తీ కోసం భూముల కొనుగోలు వ్యవహారం ఓ ప్రహసనంగా మారిందంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలు విపరీతంగా పెరిగిపోవడం, అలాగే ప్రభుత్వ భూములు అందుబాటులో లేకపోవడంతో భూసేకరణ ప్రధాన సమస్యగా మారింది. ఈ పథకం నీరుగారేందుకు కూడా భూసేకరణతో పాటు రాజకీయ ఒత్తిడులు, అనర్హులకు భూముల కేటాయింపు అలాగే ప్రైవేటు భూములు కొనుగోలులో అవకతవకలు చోటు చేసుకోవడం లాంటి అంశాలన్ని కారణమయ్యాయంటున్నారు. దళితబంధుపైనా సందేహాలుప్రతి నియోజకవర్గంలోని వంద ఎస్సీ కుటుంబాలకు దళిత బంధు పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఆర్థికసహాయం అందించేందుకు ప్రభుత్వం దళితబంధు పథకాన్ని తెరపైకి తెచ్చింది. అయితే లబ్దిదారుల కేటాయింపుల్లోనూ, గ్రామా ల వేస్సీలకు శాపంగా పరిగణిమిస్తోందంటున్నారు.

# బకాయిల భారం గ్రంథాలయాలకు శాపం

మెదక్ : విజ్ఞానం పెంపొందించడంలో గ్రంథాలయాలు కీలక భూమిక పోషిస్తున్నాయి. గ్రంథాలయాలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, స్థానిక సంస్థలు కొన్నేళ్లుగా నిర్లక్ష్యం చేయడంతో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. కొన్నేళ్లుగా గ్రంథాలయాలకు రావాల్సిన సెస్‌ను ప్రభుత్వ శాఖలు చెల్లించడం లేదు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్నా... అందులో గ్రంథాలయాలకు చెల్లించాల్సిన 0.08 శాతం సెస్‌ను అందించడం లేదు. ఫలితంగా పుస్తకాలు, స్టేషనరీ కొనుగోళ్లు, పత్రికలు, విద్యుత్ బిల్లులు, స్వీపింగ్ చార్జీలు, సిబ్బంది వేతనాలతో పాటు మెయింటనెన్స్‌కు నిధులు సరిపోక



ఆర్థిక ఇబ్బందులతో గ్రంథాలయాలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఉద్యోగాలకు సిద్ధమయ్యే వాళ్లు గ్రంథాలయాలకు వస్తున్నా.. వారికి కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉండడం లేదు. గ్రంథాలయాల నుంచి ఎన్ని విజ్ఞప్తులు వచ్చినా సెస్ చెల్లింపుల విషయంలో గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి సరైన స్పందన రావడం లేదు. మెదక్ జిల్లాలో 16 గ్రంథాలయాలుమెదక్ జిల్లాలో 16 గ్రంథాలయాలున్నాయి. అందులో జిల్లా కేంద్రంతో పాటు 13 గ్రంథాలయాలకు సొంత భవనాలు ఉన్నాయి. గ్రంథాలయాల నిర్వహణకు సర్కారు నుంచి ఎలాంటి నిధులు రావడం లేదు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రజల నుంచి వసూలయ్యే పన్నుల్లోంచి ప్రతియేటా చెల్లించే 8శాతం సెస్ నిధులతోనే గ్రంథాలయాల నిర్వహణ కొనసాగుతున్నది. సెస్ రూపంలో చెల్లించే నిధులను అడిట్‌లో కూడా ఆయా శాఖలు సూచించాల్సి ఉంటుంది. ఇటీవల కొంత చెల్లించినప్పటికీ మూడేళ్ల నుంచి మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు స్పందించని పరిస్థితి. దాంతో జిల్లా గ్రంథాలయాలు నిర్వహణ భారంగా మారుతోందని గ్రంథపాలకులు పేర్కొంటున్నారు.రూ. 2.88కోట్ల బకాయిలుకొత్త జిల్లాలు ఏర్పాటైన తర్వాత స్థానిక సంస్థలకు వివి ధ పథకాల ద్వారా నిధులు విడుదలవుతున్నాయి. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో పన్నుల వసూళ్ల ప్రక్రియ పకడ్బందీగా చేపడుతున్నారు. ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ చివరి వరకు 80శాతానికి పైగా వసూలు చేస్తున్నారు. వసూలు చేసిన పన్నుల్లో 0.08 శాతం సెస్ కూడా అదే రోజు జిల్లా గ్రంథాలయాల సంస్థ ఖాతాకు బదిలీ చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. జిల్లాలోని మెదక్ మున్సిపాలిటీ నుంచి రూ.84,05,891, తూప్రాన్‌లో రూ.15,74,595, నర్సాపూర్‌లో రూ.11,02,300, రామాయంపేటలో రూ7,63,494తో పాటు, జిల్లావ్యాప్తంగా ఉన్న 469 గ్రామపంచాయతీల నుంచి రూ.1,70,31,566 సెస్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. మొత్తం రూ. 2,88,31,566 వరకు ఉంది. విధిగా సెస్ చెల్లించాలి – చంద్రాగౌడ్, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్, మెదక్‌స్థానిక సంస్థలు ప్రజల నుంచి వసూలు చేసే పన్నుల్లోంచి 0.08 శాతం సెస్ రూపంలో గ్రంథాలయాల సంస్థకు విధిగా చెల్లించాలి. ప్రస్తుతం నోటిఫికేషన్లు వెలువడిన నేపథ్యంలో పేద విద్యార్థులు చదువుకోవడానికి గ్రంథాలయాలకు వస్తున్నారు. వారికి అవసరమైన పుస్తకాలు కొనుగోలు చేయాలంటే నిధులు లేక ఇబ్బందులు పడుతున్నాం. జిల్లా గ్రంథాలయ సంస్థకు గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి రావాల్సిన సెస్ సక్రమంగా వసూలు కావడం లేదు.బకాయిలు పేరుకుపోయాయి. ఈ విషయమైన జిల్లా అదనపు కలెక్టర్, డీపీవోలకు విజ్ఞప్తి చేశాం.

# చెరువుల మట్టి తరలింపుపై కలెక్టర్ నిఘా..

పెద్దపల్లి : జిల్లాలోని చెరువుల నుంచి అనుమతులకు మించి ఇటుక బట్టీల యజమానులు మట్టిని అక్రమంగా తరలించకుండా ఉండేందుకు పకడ్బందీగా నిఘాను పెంచాలని కలెక్టర్ భావిస్తున్నారు. ఆయా శాఖాధికారులు నేరుగా అనుమతులు ఇవ్వకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పలువురు ఇటుక బట్టీల యజమానులు గనులు, భూగర్భ శాఖాధికారులకు మట్టి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయమై సదరు శాఖాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకవెళ్లడంతో ఆయా చెరువుల నుంచి ఏమేరకు మట్టిని తరలించుకుపోయే అవకాశాలున్నాయని నీటి పారుదల శాఖాధికారులను సర్వేకు ఆదేశించారు. ఆ తర్వాత మట్టి తరలింపునకు కావాల్సిన అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన తర్వాతనే కలెక్టర్ అనుమతులను ఇవ్వనున్నారు. జిల్లా ఏర్పాటు కాకముందు రెవెన్యూ, గనులు, భూగర్భ శాఖాధికారుల ద్వారా అనుమతులు ఇచ్చిన ప్రభుత్వం జిల్లా ఏర్పాటైన తర్వాత నీటి పారుదల శాఖాధికారుల ద్వారా అనుమతులను ఇచ్చారు. అనుమతులు పొందినవాళ్లు అంతకుమించి అక్రమంగా మట్టిని తరలించుకుపోయి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో గత ఏడాది నుంచి తిరిగి గనులు, భూగర్భ శాఖాధికారులకే అనుమతులు ఇచ్చే బాధ్యతను అప్పగించారు. ఈ ఏడాది నీటి పారుదల శాఖాధికారులు ఇచ్చే నివేదికల ఆధారంగా కలెక్టరే నేరుగా అనుమతులు ఇవ్వాలని భావిస్తున్నారు. వేసవి కావడంతో పెద్దపల్లి, సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, మంథని, ముత్తారం, ఎలిగేడు, ధర్మారం, జూలపల్లి, కమాన్‌పూర్ తదితర గ్రామాల్లోని చెరువుల్లో నీటి మట్టాలు తగ్గాయి. చెరువుల ఆయకట్టు కింద వరి పంట సాగు చేస్తుండడంతో వాటికే నీళ్లు సరిపోవడం లేదు. కొన్ని చెరువుల్లో పూర్తిగా నీళ్లు లేకుండా పోయాయి. నెలరోజుల్లో వరి కోతలు పూర్తి కావడంతో పాటు ఎండలకు చెరువులు సైతం ఎండిపోనున్నాయి. ఆ చెరువుల నుంచి మట్టిని తరలించుకుపోవాలని ఇటుక బట్టీల యజమానులు భావిస్తున్నారు. చెరువుల మట్టి కోసం ఇప్పటికే పలువురు ఇటుక బట్టీల యజమానులు గనులు, భూగర్భ శాఖాధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకవెళ్లారు. గత నెల 19వ తేదీన 'చెరువు మట్టిపై కన్ను' నేతల చుట్టూ ఇటుక బట్టీల యజమానులు అనే శీర్షికన ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్‌లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఏటా నామమాత్రంగా అనుమతులు..ప్రతిఏటా ఇటుక బట్టీల యజమానులు నామమాత్రంగా అనుమతులు పొందుతూ అక్రమంగా పెద్దఎత్తున మట్టిని తరలించుకుపోతున్నారనే విషయమై పలుసార్లు ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురించిన విషయం విదితమే. ఈసారి కూడా ఇటుక బట్టీల యజమానులు బడా ప్రజాప్రతినిధులు అండదండలతో చెరువుల మట్టిని అనుమతులకు మేరకు గాకుండా అంతకుమించి తరలించుకుపోవాలని యత్నిస్తున్నట్లు తెలుస్తున్నది. ముందస్తుగానే గనులు, భూగర్భ శాఖలో దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో మట్టి తరలింపునకు అనుమతులు ఇచ్చే విషయమై ఆచితూచి అడుగేయాలని భావిస్తున్నట్లు తెలుస్తున్నది. ఆ మేరకు ప్రస్తుతం జిల్లాలో ఉన్న చెరువులు, కుంటలు ఎన్ని, వాటిలో ఏ మేరకు నీళ్లు ఉన్నాయి, నీళ్లు లేకుండా ఎన్ని ఖాళీగా ఉన్నాయి, ఎన్ని చెరువులు ఎండిపోయాయి, ఎంత పరిమాణంలో పూడిక మట్టి తీయవచ్చు, అసలు మట్టి తీసేందుకు అవకాశాలున్నాయా, లేదా, తదితర అంశాలపై సర్వే చేసి నివేదిక సమర్పించాలని కలెక్టర్ నీటి పారుదల శాఖాధికారులను ఆదేశించడంతో వాళు సర్వే ప్రారంభించారు. అన్ని చెరువుల వద్దకు అధికారులు, సిబ్బంది వెళ్లి సర్వే చేస్తున్నారు. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చాలా చెరువులు, కుంటల్లో కొంత మేరకు మాత్రమే పూడిక మట్టిని తీశారు.

## దీపం ఉండగానే.. ధనదాహం తీర్చుకోవాలని..!

నల్గొండ : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్)తో పాటూ, ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్), నియోజకవర్గ అభివృద్ధి పథకం (సీడీపీ) పథకాల కింద ఉమ్మడి జిల్లాలోని పన్నెండు నియోజకవర్గాల పరిధిలోని పలు పల్లెల్లో మౌలిక వసతుల కల్పన కింద సీసీ రహదారుల నిర్మాణం జోరుగా సాగుతోంది. మరో నాలుగు రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో ఆ లోపే ఈ మూడు పథకాల కింద మంజూరైన రహదారులను గుత్తేదారులు నిర్మించాల్సి ఉంటుంది. ఈ నెల 31 దాటిన తర్వాత నిర్మించిన రహదారులకు బిల్లులు మంజూరు కావు. దీంతో గడువు లోపు పనులు పూర్తి చేయాలన్న తలంపుతో గుత్తేదారులు నాణ్యతను పట్టించుకోకపోగా.. అధికారులు సైతం అటువైపు చూడకపోవడంతో రహదారుల నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతోంది.

ఇవిగో దృష్టాంతాలు..

ఆలేరు నియోజకవర్గం గుండాల మండలం నూనెగూడెం నుంచి బండ కొత్తపల్లి గ్రామానికి మధ్య 1400 మీటర్ల సీసీ రహదారి నిర్మాణాన్ని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.55 లక్షలతో చేపట్టారు. అధికారుల పర్యవేక్షణ లోపం, గుత్తేదారు ఇసుక, సిమెంటును సమపాళ్లలో కలపకపోవడంతో నిర్మించిన కొన్ని రోజులకే పగుళ్లు తేలుతోంది. వలిగొండ మండల కేంద్రంలో రూ.5 కోట్లతో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సీసీ రహదారుల్లో ఎక్కడా నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు, గుత్తేదారులతో కలిసిపోయి రహదారి నిర్మించిన రెండు రోజులకే పగుళ్లు వచ్చినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని పలు మండలాలు, పల్లెల్లో చేపట్టిన పనుల్లో నాణ్యత లేదని ఇటీవలే కొందరు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గాల్లోని పలు చోట్ల అధికారులకు ఫిర్యాదు రావడం.. వారు క్షేత్రస్థాయిలో పర్యటించడంతో.. గుత్తేదారులు తిరిగి రహదారులను నిర్మించారు.

మూడు పథకాల కింద సాగుతున్న పనులు

మూడు జిల్లాల్లో కలిపి 2487 పనులకు గానూ మూడు పథకాల కింద సుమారు రూ.100 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఒక్క ఎన్ఆర్ఈజీఎస్ కిందనే సీసీ రహదారులకు రూ.50 కోట్ల వరకు మంజూరయ్యాయి. సీడీపీ, ఎస్‌డీఎఫ్ కింద మంజూరైన నిధులు వీటికి అదనం. క్షేత్రస్థాయిలో కొంత మంది ప్రజాప్రతినిధులు సీడీపీ, ఎస్‌డీఎఫ్ కింద మంజూరైన పనులను కొంత కమీషన్ తీసుకొని ఉప గుత్తేదారులకు అప్పగిస్తున్నారు. ముందే కమీషన్ చెల్లించడంతో స్థానిక ప్రజాప్రతినిధులు పనులు నాణ్యతగా లేకున్నా ప్రశ్నించడం లేదు. మరోవైపు అధికారులకూ నాణ్యత విషయంలో ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తుల నుంచి ఒత్తిడి ఉండటంతో పాటూ బిల్లుల సమయంలో 10 శాతం కమీషన్ వస్తుండటంతో వారూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణ, మండల కేంద్రాల్లో పలు చోట్ల తప్పితే గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన పది రోజులకే సీసీ రహదారులకు పగుళ్లు వస్తున్నాయి. మరోవైపు సీసీ రహదారులను నిర్మిస్తున్నా.. బిల్లులు మాత్రం ఎప్పుడు వస్తాయోనన్న బెంగ గుత్తేదారులకు ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే పల్లెల్లో పలు పనులు చేసిన చాలా చోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉంటడంతో స్థానిక సర్పంచులతో పాటూ గుత్తేదారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా రూ.100 కోట్లకు పైగా నిధులతో చేపట్టిన ఈ పనుల బిల్లులనైనా తొందరగా చెల్లించేలా అధికారులపై గుత్తేదారులు ఒత్తిడి పెంచుతున్నారు.

కొన్ని చోట్ల నాణ్యతపై ఫిర్యాదులు వచ్చిన మాట వాస్తవమేనని, క్షేత్రస్థాయిలో అధికారులకు, సిబ్బందికి నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, పనులు నాణ్యతగా లేకుంటే గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని సూచించామని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.

## సమీకృతం.. సతమతం

నల్గొండ : ఉమ్మడి జిల్లాలో సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు నత్తను తలపిస్తున్నాయి. మరో నెల రోజుల్లో ప్రభుత్వం నిర్దేశించిన గడువు ముగియనుంది. ఆ లోగా పనులు పూర్తికావడం గగనంగా మారింది. స్థలాల ఎంపిక, నిధుల విడుదలలో జాప్యం, బిల్లుల చెల్లింపులో ఆలస్యం వంటి కారణాలతో గుత్తేదారులు పనులను మధ్యలోనే నిలిపేస్తున్నారు. కొన్ని పట్టణాల్లో పునాదుల్లో పనులు నిలిచిపోగా, మరి కొన్ని పురపాలికల్లో రెండేళ్లుగా ఆగుతూ సాగుతూనే ఉన్నాయి. దీంతో చిరు వ్యాపారులు రహదారులపైనే వ్యాపారాలు సాగిస్తూ ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నారు.

రూ.61 కోట్లతో నిర్మాణం

ఉమ్మడి జిల్లా పరిధిలోని 19 పురపాలికల్లో ఒక్కోటి చొప్పున వెజ్, నాన్ వెజ్ సమీకృత మార్కెట్ల నిర్మాణానికి ప్రభుత్వం 2021 మే మాసంలో రూ.61 కోట్లు మంజూరు చేసింది. అందులో సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ పట్టణాల్లో ప్రభుత్వం మంజూరుచేసిన నిధులకు తోడు ఆయా మున్సిపాలిటీలు అదనంగా రూ.2.70 కోట్ల పట్టణ ప్రగతి నిధులు కేటాయించాయి. భువనగిరి సమీకృత మార్కెట్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 కోట్ల నిధులకు మున్సిపాలిటీ మరో రూ.5 కోట్లు కేటాయించింది. నల్గొండ, దేవరకొండ, మిర్యాలగూడ, చౌటుప్పల్ మున్సిపాలిటీలకు రూ.4.5 కోట్ల చొప్పున, నేరేడుచర్ల మార్కెట్‌కు రూ.3.90 కోట్లు, మిగతా మున్సిపాలిటీలకు రూ.2 కోట్ల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

ప్రగతి అధోగతిసమీకృత మార్కెట్ల నిర్మాణాలకు ప్రభుత్వం నిర్దేశించిన గడువు వచ్చే ఏప్రిల్‌తో ముగియనుంది. క్షేత్రస్థాయిలో నిర్మాణాల పనులు పరిశీలిస్తే సూర్యాపేట, భువనగిరి, నల్గొండ పట్టణాల్లో మినహా మిగతా మున్సిపాలిటీల్లో సగం కూడా పూర్తి కాలేదు. చండూరు, తిరుమలగిరి, పోచంపల్లిలో స్థలాన్వేషణలో రెండేళ్లు గడిచిపోయాయి. మిగతా చోట్ల స్థలాల ఎంపికనే పూర్తి కాలేదు భువనగిరిలో ప్రహరీ మినహా మిగతా పనులు పూర్తి చేశారు. సూర్యాపేటలో విద్యుద్దీకరణ, రంగుల పనులు తుదిదశకు చేరాయి. నల్గొండలో ఎలివేషన్, ఫ్లోరింగ్ వంటి పనులు పూర్తి చేసి నిలిపివేశారు. అదనపు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దేవరకొండ పురపాలికలో నిర్మాణ పనులు పునాదుల్లోనే కొట్టుమిట్టాడుతున్నాయి. నేరేడుచర్ల పురపాలికలో కోర్టు స్టే కారణంగా 5 శాతం పూర్తి చేసి నిలిపివేశారు. మిర్యాలగూడ, నందికొండ, కోదాడ, హుజూర్‌నగర్ పట్టణాల్లో 20 శాతంలోపు, ఆలేరు, చౌటుప్పల్, యాదగిరిగుట్ట, మోత్కూరు పట్టణాల్లో 30 నుంచి 40 శాతం మధ్య పనులు పూర్తయ్యాయి. పెండింగ్ పనులు పూర్తి చేయాలంటే మరో ఏడాది కాలం పట్టే అవకాశం ఉంది.

వేగవంతం చేస్తాం–కె.వెంకటేశ్వర్లు, ఎస్ఈ, ప్రజారోగ్యశాఖ, నల్గొండ

ఆలస్యంగా పనులు జరుగుతున్న మాట వాస్తవమే. సూర్యాపేట, భువనగిరి, నల్గొండ మార్కెట్లు తుది దశకు వచ్చాయి. త్వరలోనే అవి ప్రారంభం కానున్నాయి.

## యార్డు వెలుపల కాయల సేకరణ వద్దు



జగిత్యాల : జగిత్యాల వ్యవసాయ మార్కెట్యార్డు ఆధ్వర్యంలోని చల్‌గల్‌లోని మామిడి మండీ పరిధిలో ఈ సీజనులో పలువురు వ్యాపారులు మామిడి కాయల కొనుగోలును యార్డు వెలుపలగల షెడ్లలో ప్రారంభించారు. మామిడి మార్కెట్లో రూ.6 కోట్ల వ్యయంతో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన నాలుగు భారీ షెడ్లు అందుబాటులోకి రావటం, చల్‌గల్ వాలంతరి ప్రదర్శన క్షేత్రం నుంచి తీసుకున్న అదనపు 10 ఎకరాల స్థలంలోనూ మామిడి కాయల క్రయవిక్రయాలను చేపట్టనుండటంతో ఈ సీజనులో వ్యాపారులందరూ యార్డులోకి రావాల్సిందేనని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గతంలో మాదిరిగా యార్డు వెలుపల తమ సొంత స్థలాలు, ప్రైవేటు అద్దెస్థలాల్లో కొనుగోళ్లు జరపవద్దని, వ్యాపారులందరూ తప్పనిసరిగా యార్డులోనే ఏర్పాట్లు చేసుకోవాలని మార్కెటింగ్ అధికారులు ఉత్తర్వులు, వ్యాపారులకు నోటీసులు జారీచేశారు. ఇందుకు అనుగుణంగా గత సీజన్‌లో మార్కెట్ఫీజు చెల్లించిన వ్యాపారులకు వరుసక్రమంలో మార్కెట్లోని షెడ్లలో స్థలాన్ని కేటాయించాలని నిర్ణయించారు. ఇప్పటికే ప్రైవేటు స్థలాల్లో కాయల కొనుగోలును ప్రారంభించగా మరికొందరు కూడా సొంత స్థలాల్లోనే కొనుగోలుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జగిత్యాల–నిజామాబాద్ జాతీయ రహదారి వెంబడి ప్రైవేటు షెడ్లుండటం, గతంలో రహదారి ప్రమాదాలు జరిగి కొందరు కార్మికులు మృత్యువాత పడటంతో తప్పనిసరిగా వ్యాపారులందరూ మండీలోకే రావాలని నిర్దేశించారు. సీజన్‌లో దాదాపుగా 5 వేలమంది వరకు కార్మికులు వివిధ రాష్ట్రాల నుంచి కాయల గ్రేడింగ్, ప్యాకింగ్, లోడింగ్ తదితరాలకు వస్తారు, వీరంతా యార్డులోనే బసచేస్తారు. కాయల తరలింపునకు వేలాది వాహనాలు వస్తాయి కాబట్టి ఈ వాహనాలన్నీ రోడ్డుపక్కనే రోజుల తరబడి పార్కింగ్ చేయటంతో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. మరోవైపు ప్రైవేటు స్థలాల్లో కొనుగోళ్లు జరిపితే మార్కెటింగ్ అధికారుల ఆజమాయిషీ కొరవడుతుంది, మార్కెట్ ఫీజు తగ్గుతుంది. తూకం, ధరల నిర్ణయం రైతులకు చెల్లింపు తదితరాల్లోనూ ఇబ్బందులు తలెత్తుతాయి. మరోవైపు కమీషన్ లైసెన్స్‌గల వ్యాపారులు కాబట్టి ఈ సీజన్‌నుంచి బహిరంగ వేలం పద్ధతిన కాయలను కొనాలని యోచిస్తుండటంతో అందరూ యార్డులోకి వస్తేనే వేలం సాధ్యపడుతుంది. ఈ నేపథ్యంలో మరో వారం రోజుల్లో కాయల కొనుగోళ్లు పెరిగే అవకాశమున్నందున మామిడి మండీలోనే మామిడి కాయల లావాదేవీలు జరిపేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. దీనిపై మార్కెట్ కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ వ్యాపారులతో మాట్లాడి జిల్లా కలెక్టర్ ఆదేశాలను అమలు చేస్తామని వివరించారు.


## పెరిగిన ఉపాధి కూలీ



కరీంనగర్ : ఉపాధి హామీ పథకం పనులకు దినసరి కూలీ రేట్లను కేంద్ర ప్రభుత్వం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఉమ్మడి జిల్లా కూలీలకు ప్రయోజనం చేకూరనుంది. ఇప్పటి వరకు కూలీలకు రూ.257 చెల్లిస్తుండగా, ఏప్రిల్ 1 నుంచి రూ.272 అందించనున్నారు. దీని ద్వారా ఉమ్మడి జిల్లా పరిధిలోని 5,01,534 కుటుంబాలు ఉండగా 9,37,073 కూలీలు ఉన్నారు. ఇందులో 3,44,344 యాక్టివ్ జాబ్‌కార్డులు ఉండగా, 5,24,372 మంది కూలీలు ఉన్నారు. ఆయా కూలీల ఒక ఒక్కొక్కరికి రూ.15 చొప్పున అదనంగా రానున్నాయి. ఏటా మార్చి నుంచి జూన్ వరకు వ్యవసాయ పనులు తక్కువగా ఉండడంతో కూలీల సంఖ్య పెరుగుతుంది. దీని ద్వారా ఏప్రిల్ 1 నుంచి పెరగనున్న దినసరి కూలీతో ఎంతగా ఆర్థికంగా లాభం చేకూరనుంది.

మారిన విధానంతో తగ్గిన కూలీలు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్(ఎన్ఎంఎంఎస్) విధానంతో ఇబ్బందిగా మారి కూలీల సంఖ్య గణనీయంగా పడిపోయింది. గతేడాది ఉమ్మడి జిల్లాలో మార్చి 31 వరకు 27,635 కుటుంబాలు వంద రోజులు పూర్తి చేసుకుంటే ప్రస్తుతం కేవలం 3,565(ఈనెల 25 వరకు) మాత్రమే పూర్తి చేయగలిగారు. జగిత్యాల జిల్లాలో గతేడాది 7,567 కుటుంబాలు వంద రోజులు పూరి చేసుకోగా ప్రస్తుతం 604, కరీంనగర్‌లో 7వేలు కాగా, 1,483, పెద్దపల్లి జిల్లాలో 5,475కి ప్రస్తుతం 606, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 7,593 పూర్తి చేసుకుంటే ఈ ఏడాది కేవలం 872 కుటుంబాలు పూర్తి చేసుకున్నాయి. గతంలో కూలీలు పనిచేసిన తర్వాత పనుల కొలతలను వారం రోజుల తరువాత ఫొటోలు తీసుకునే వారు. ప్రస్తుత విధానం అలా కాకుండా ప్రతి రోజు రెండు సార్లు ఫొటోలు తీసి ఆన్‌లైన్ చేయాల్సిన పరిస్థితి. ప్రస్తుతం వేసవి కావడంతో ఉదయం వచ్చిన కూలీలు వారి కొలతల ప్రకారం పనులు చేసుకుని వెళుతున్నారు. దీనివల్ల ఉదయం తీసుకున్నప్పటికీ మధ్యాహ్నం సమయం మళ్లీ కూలీలు పనుల వద్దకు వెళ్లి వారి తీసుకోవడం కష్టంగా మారింది. ఒక్క పనిని రెండేసి మార్లు తీయడం ఇబ్బందిగా మారిందని ఉపాధి సిబ్బంది పేర్కొంటున్నారు.

## ఆఖరి నిమిషంలో సద్వినియోగం ఎలా?



జగిత్యాల : ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నాయి. పాఠశాల సముదాయ (స్కూల్ కాంప్లెక్స్), మండల వనరుల కేంద్రం (ఎమ్మార్సీ)ల నిర్వహణకు ఆర్థిక చేయూతనిస్తున్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఏటా విడతల వారీగా నిధులు కేటాయిస్తున్నారు. ఈ క్రమంలో ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి తొలి విడతలో సగం కంటే ఎక్కువ నిధులు విడుదల చేశారు. వార్షిక ఏడాది ముగింపు దశలో రెండో విడత వాటా జమ అయ్యాయి. ఈ నెలా ఖరులోపు ఖర్చు చేయకుంటే నిధులు వెనక్కి వెళ్లిపోనున్నాయి. కార్యాలయ నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎమ్మార్సీలకు నిధులు మంజూరు చేశారనే ఊరట ఆందోళన కలిగిస్తోంది. ఆఖరి నిమిషంలో ఎలా ఖర్చు చేయాలనే అయోమయం నెలకొంది.

నిర్వహణకు ఆర్థిక చేయూత విద్యాభివృద్ధిలో ఎమ్మార్సీలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. మండలాల్లో విధులు నిర్వహిస్తున్న సీఆర్పీలు పాఠశాలల వారీగా సేకరిస్తున్న పలు రకాల సమాచారాన్ని ఎమ్మార్సీల పరిధిలో పర్యవేక్షిస్తున్నారు. కార్యాలయ సామగ్రి, విద్యుత్తు బిల్లులు, సమావేశాలు, కంప్యూటర్ల నిర్వహణ ఇతరత్ర అవసరాలకు విద్యాశాఖ గ్రాంట్లను మంజూరు చేస్తోంది. ఈ నిధులతో ఆర్థిక సమస్యలు తీరుతున్నాయి. నిధుల ఖర్చులో పారదర్శకత పాటిస్తున్నారు. ప్రతి పైసాకు లెక్క చెప్పాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లాకు రూ.39.48 లక్షలు

ఉమ్మడి జిల్లాలో 47 ఎమ్మార్సీలు ఉన్నాయి. ఒక్కో ఎమ్మార్సీకి ఏటా రూ.84 వేల చొప్పున నిధులు విడుదల చేస్తున్నారు. ఈ ఏడాదిలో తొలి విడతలో రూ.45 వేలు, ప్రస్తుతం రెండో విడతలో రూ.39 వేలు జమ చేశారు. ఉమ్మడి జిల్లాలో తొలిసారి రూ.21.15 లక్షలు, రెండోసారి రూ.18.33 లక్షలు మొత్తం రూ.39.48 లక్షలు మంజూర య్యాయి. మార్చిలోపు నిధులు ఖర్చు చేయాలని ఆదేశించడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మూడు రోజుల గడువు మిగిలి ఉండటంతో ఎలా ఖర్చు చేస్తామని ప్రశ్నిస్తున్నారు.

## దుస్తుల కుట్టుకూలీ రూ. 1.31 కోట్లు విడుదల

నల్గొండ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా సరఫరా చేసిన ఏకరూప దుస్తుల కుట్టు కూలీ విడుదలైంది. నల్గొండ జిల్లాలో 2022–23 విద్యా సంవత్సరంలో ఏక రూప వస్త్రాలు కుట్టిన వారికి నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2022–23లో జిల్లాలో 1,31,543 మంది విద్యార్థులకు ఏక రూప దుస్తులు కుట్టించారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున మొత్తం 2,63,086 దుస్తులు కుట్టించారు. ఒక్కో డ్రెస్‌కు కుట్టు కూలి కింద రూ.50గా నిర్ణయించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు మొదట ఒక జతను ఆగస్టులో, మరో జతను సెప్టెంబర్‌లో అందచేశా



రు. మొత్తం కుట్టు కూలి కింద రూ.1,31,54,300 చెల్లించా ల్సి ఉంది. కుట్టిన వారికి ఒక్క రూపాయి విడుదల కాకపోవడంతో ఆందోళన చెందారు. మళ్లీ 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటి నుంచే దుస్తులు కుట్టాల్సి ఉంది. కొత్తవి కుట్టాల్సి రావడం, పాత వాటికి డబ్బులు ఇవ్వకుంటే కుట్టే వారు ముందుకు రారన్న ఉద్దేశంతో ప్రభుత్వం కుట్టు కూలి నిధులు విడుదల చేసిందని భావిస్తున్నారు. మొత్తం మీద యూనిఫాం దుస్తులు కుట్టిన డబ్బులు విడుదల చేసినందుకు దర్జీలు, కుట్టిన సంఘాల వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు వచ్చిన కుట్టు కూలి గ్రాంట్ నిధులను సంబంధిత పాఠశాల యాజమాన్య కమిటీ బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు డీఈవో బి.భిక్షపతి తెలిపారు. యూనిఫాంలు కుట్టిన వారు సంబంధిత ప్రధానోపాధ్యాయుల నుంచి వివరాలు తెలుసుకుని వారి ద్వారా రావాల్సిన డబ్బులను బ్యాంకు ఖాతా ద్వారా పొందాలని సూచించారు.

## ఆహార భద్రతకు నిరీక్షణే!

సూర్యాపేట : పట్టణ వాసి మణి మూడేళ్ల కిందట పెళ్లి చేసుకున్నారు. రేషన్ కార్డు కోసం 2019లో దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నుంచి రేషన్ కార్డు మంజూరు కాలేదు. తహసీల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మునగాలకు చెందిన నగేశ్‌కు 2020లో పెళ్లి అయింది. కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు వారి తల్లిదండ్రుల కార్డులో నుంచి ఆయన పేరు తొలగించారు. నూతన జంట రేషన్ కార్డుకు కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. కానీ నేటి వరకు కార్డు రాకపోవడంతో ప్రభుత్వ పథకాలకు దూరం కావాల్సిన పరిస్థితి. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అమలు కావాలంటే రేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాలి. నిత్యావసర సరకుల నుంచి ప్రస్తుతం ఇస్తున్న రెండు పడక గదుల ఇళ్ల వరకు రేషన్‌కార్డు తప్పనిసరి. కానీ ఈ కార్డు మంజూరులో ప్రభుత్వ అలసత్వం వల్ల నిరుపేదలు సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారు. ఆహార భద్రత కార్డుల్లో పేర్ల నమోదు, కొత్తవి జారీ కోసం పాత కార్డుల్లో పేర్ల తొలగింపునకు దరఖాస్తు చేసుకున్నా. ఫలితం లేకుండా పోతోంది. గతేడాది కొత్త కార్డులను పంపిణీ చేసినా పేర్లు మార్పిడి దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ

జిల్లా వ్యాప్తంగా పేర్ల మార్పిడికి సంబంధించి వివిధ కారణాలతో సుమారు 24,740 దరఖాస్తుల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. వాటి పరిష్కారానికి డీఎస్‌వో, తహసీల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం



చేస్తున్నారు. కాగా కొత్త రేషన్ కార్డుల కోసం 13,467 దరఖాస్తులు రాగా గత ఏడాది 8,753 మంజూరు చేశారు. 2,760 వరకు దరఖాస్తులు తిరస్కరించారు. 478 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా వాటిపై సర్వే జరిపి వెంటనే మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నారు.

పథకాలకు దూరం

రేషన్ కార్డుల్లో పేర్లు లేకపోవడంతో అర్హులు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ఏళ్ల తరబడి రేషన్ సరకులు పొందలేకపోతున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినా,. వ్యాధులు వచ్చినా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చూపించుకునేందుకు ఆరోగ్యశ్రీ కార్డు వర్తించడం లేదు. దీంతో వారు కార్పొరేట్ వైద్యానికి దూరం అవుతున్నారు. విద్యార్థులు ఉపకార వేతనాలకు కూడా దూరం అవుతున్నారు. రూ.వేల ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి దరఖాస్తులను పరిష్కరించేలా చొరవ చూపాలని వేడుకుంటున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు తప్పనిసరిపుల్లయ్య, డీఎస్‌వో, సూర్యాపేట

కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నాం. కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలన్నా... పేర్లు మార్పిడి చేయాలన్నా ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది. రాగానే వెంటనే పరిష్కరిస్తాం.

## ఎదుర్కొనే ధైర్యం లేక కుట్ర

సూర్యాపేట : రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడం పార్లమెంట్ చరిత్రలో చీకటి దినమని, ప్రజాస్వామ్యానికి చెరగని మచ్చని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. పార్లమెంట్ సభ్యత్వం రద్దుకు వ్యతిరేకంగా జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చేపట్టిన నిరసన దీక్షలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీని ఎదుర్కొనే ధైర్యం లేకనే ఆయనపై కుట్ర చేసి అనర్హత వేటు వేశారని విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలను అణచివేసే దోరణిగా వ్యవహరించడం సరికాదని ఆరోపించారు. ఎన్ని కేసులు వేసినా, ఎంత మంది ఇబ్బంది పెట్టినా వెనకడుగు వేయని నాయకుడు రాహుల్‌గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చకిలం రాజేశ్వర్‌రావు, అంజద్ అలీ, కోతి గోపాల్, తంగెళ్ల కరుణాకర్‌రెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ బకాయిలు రూ.2,500 కోట్లు మంజూరు చేయండి

## కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ తో ముఖ్యమంత్రి వైయస్.జగన్ భేటీ

న్యూఢిల్లీ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి రాష్ట్రానికి ఇవ్వాల్సిన బకాయిలు సుమారు రూ. 2,500 కోట్లు ఉన్నాయని, వెంటనే ఈ డబ్బు మంజూరుచేయాలని సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఇవాళ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో ముఖ్యమంత్రి వైయస్.జగన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై సీఎం వైయస్ జగన్ చర్చించారు. పలు అంశాలపై కేంద్ర మంత్రికి సీఎం వైయస్ జగన్ నివేదించారు. ఈ సమావేశం ముగిసిన తర్వాత సీఎం తన ఢిల్లీ పర్యటనను ముగించుకుని విజయవాడ బయల్దేరారు.

**ముఖ్యమంత్రి చర్చించిన అంశాలు:** 1. ఉపాధి హామీ పనులకు సంబంధించి రాష్ట్రానికి ఇవ్వాల్సిన బకాయిలు సుమారు రూ. 2,500 కోట్లు ఉన్నాయని, వెంటనే ఈ డబ్బు మంజూరుచేయాలని కోరిన సీఎం. 2.రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం తప్పులేకున్నా... రుణాలపై కేంద్రం ఆంక్షలు విధించడం సరికాదని వివరించిన సీఎం. నిబంధనలు ప్రకారం ఇచ్చిన రుణ పరిమితిని కూడా తగ్గించారని, 2021-22లో రూ. 42,472 కోట్ల రుణపరిమితి కల్పించి, తదుపరి కాలంలో రూ. 17,923 కోట్లుకు కుదించిన విషయాన్ని ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లిన సీఎం. ఈ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తిచేసిన సీఎం 3. తెలంగాణ డిస్కంల నుంచి ఏపీ జెన్‌కోకు, 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకూ సరఫరాచేసిన విద్యుత్తుకు సంబంధించి రూ. 7,058 కోట్లు రావాల్సి ఉందని, ఈ డబ్బును వెంటనే ఇప్పించాల్సిందిగా కోరిన సీఎం. 4. 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రానికి రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ కింద రూ. 36,625 కోట్ల రూపాయలు పెండింగులో ఉన్నాయని, వాటిని విడుదల చేసేలా చూడాలని కోరిన సీఎం. 5. పోలవరం ప్రాజెక్టును వేగవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి అడహాక్‌గా రూ. 10 వేల కోట్లు మంజూరుచేయాలని కోరిన సీఎం. 6. డయాఫ్రంవాల్ ప్రాంతంలో చేయాల్సిన మరమ్మతులకు దాదాపు రూ. 2020 కోట్లు ఖర్చు చేయాల్సి ఉందని, వెంటనే ఈ నిధులు విడుదలచేయాలన్న సీఎం. 7. పోలవరం ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ఖర్చుచేసిన రూ. 2600.74 కోట్ల రూపాయలను సత్వరమే రీయింబర్స్ చేయాలన్న సీఎం. 8. పోలవరం ప్రాజెక్టు అంచనాలను టెక్నికల్‌అడ్వయిజరీ కమిటీ రూ. 55,548 కోట్లుగా నిర్ధారించింది. దీనికి వెంటనే ఆమోదం తెలపాలని కోరుతున్నాను. దీంతోపాటు ప్రాజెక్టుకు సంబంధించి ఇతరత్రా అంశాలను కూడా చర్చించిన సీఎం. 9.రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామంటూ పార్లమెంటు సాక్షిగా కేంద్రం హామీ ఇచ్చిందని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని విజ్ఞప్తిచేసిన సీఎం.

# తీవ్ర స్థాయికి ఎంపీ ఆదాల , ఎమ్మెల్యే అనిల్ అనుచరుల మధ్య విభేదాలు..



నెల్లూరు : ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి, సిటీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ అనుచరుల మధ్య విభేదాలు తీవ్ర స్థాయికి చేరాయి. రూరల్ నియోజకవర్గంలోనూ అనిల్ అనుచరులు రెచ్చిపోతున్నారు. ఇష్టారాజ్యంగా ప్రభుత్వ, ప్రయివేటు భూములు, స్థలాల దురాక్రమణ జరుగుతోంది. అక్కచెరువుపాడులో ప్రయివేటు భూములని అనిల్ అనుచరులు ఆక్రమించారు. యజమానులు, అనిల్ అనుచరుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదాలు చోటు చేసుకున్నాయి. అనిల్ వర్గీయులు ముప్పై మందిని అదుపులోకి తీసుకుని పోలీసులు స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించేశారు. వైసీపీ పెద్దల దృష్టికి ఆదాల తీసుకువెళ్లినట్టు సమాచారం. ఇలాగైతే రూరల్ ఇన్ ఛార్జి బాధ్యతలు నిర్వహించలేనని ఎంపీ ఆదాల చెప్పినట్టు నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది.

వైసీపీ అధినేత జగన్‌ను ఎవరైనా విమర్శిస్తే ఒంటి కాలిపై లేచే వైసీపీ ఎమ్మెల్యేల్లో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ఒకరు. నెల్లూరు నగర ఎమ్మెల్యే అయిన అనిల్ పరిస్థితి మంత్రి పదవి కోల్పోయాక కూడా ఆయన ఆగడాలు ఆగడం లేదు. ప్రతి ఒక్కరిపైనా నోరేసుకుని పడిపోతున్నారు. సవాళ్లకు దిగుతున్నారు. ఇక ఆయన అండ చూసుకుని అనుచరులు మరింత రెచ్చిపోతున్నారు. సొంత పార్టీ నాయకులు లేరు.. విపక్షాలన్న తేడా లేదని ఆదాల వైసీపీ పెద్దల దృష్టికి తీసుకెళ్లడం బట్టి అర్థమవుతోంది. ఇలాగైతే రూరల్ ఇన్ ఛార్జి బాధ్యతలు నిర్వహించలేనని ఎంపీ ఆదాల చెప్పారంటే అనిల్ ఏ స్థాయిలో రెచ్చిపోతున్నారో తెలుస్తోంది.

# పవన్‌ను దేవుడే రక్షించాలి : మంత్రి అంబటి రాంబాబు



వైయస్ఆర్ జిల్లా: పవన్ కల్యాణ్ చంద్రబాబు కోసం పుట్టాడు, పనిచేస్తున్నాడు, పనిచేస్తాడు కూడా.. ఆయనను దేవుడే రక్షించాలని ఏపీ జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఒక మ్యానిపులేటర్ అని, వ్యవస్థల్ని మేనేజ్ చేసి అధికారంలోకి రావడానికి ప్రయత్నం చేస్తున్నాడని మంత్రి ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని పునర్ నిర్మాణం చేస్తానని చెప్పడమే గానీ.. మళ్లీ అధికారంలోకి వస్తే ఆయన ఆస్తులను, కొడుకును పునర్ నిర్మిస్తాడు తప్ప ప్రజలకు ఏమీ ఒరగదని అంబటి ఎద్దేవా చేశారు. పైగా మరోసారి అధికారం కట్టబెడితే.. పోలవరాన్ని చేసినట్లే రాష్ట్రాన్ని నాశనం చేస్తారని మండిపడ్డారు. పోలవరం విషయంలో జరిగిన తప్పిదాలన్నిటికీ గత ప్రభుత్వం భాధ్యత వహించాలి.. టీడీపీ తప్పిదాల వల్లే పోలవరం నిర్మాణంలో సమస్యలు వచ్చాయని స్పష్టం చేశారు. డయాఫ్రమ్ వాల్ నిర్మాణంలో అనేక తప్పిదాలు జరిగిందని పేర్కొన్నారు. ఈ కారణంగా ప్రాజెక్ట్ నిర్మాణం పనులు ఆలస్యం కాగా ప్రస్తుతం దాని అంచనా వ్యయం కూడా పెరిగిందని తెలిపారు.

# శ్రీరామనవమి వేడుకల్లో అపశృతి.. తారాజువ్వ పడటంతో...



ఏలూరు: పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం దువ్వలో శ్రీరామనవమి వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. జిల్లాలోని దువ్వ వేణుగోపాలస్వామి ఆలయంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. తారాజువ్వ పడటంతో ఆలయ పందిరి పూర్తిగా దగ్ధమైంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆలయంలోని భక్తులు భయంతో బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనతో స్థానికులు తీవ్రభయాందోళనకు గురయ్యారు. శ్రీరామనవమి సందర్భంగా వేణుగోపాల స్వామి ఆలయంలో నవమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వేడుకల సందర్భంగా భారీ స్థాయిలో చలువ పందిళ్లు వేశారు. వేడుకలు జరుగుతున్న సమయంలో ఉత్సవాల నిర్వహకులు బాణాసంచా కాల్చారు. ఈ క్రమంలో ఓ తారా జువ్వ చలువ పందిళ్లపై పడింది. దీంతో ఒక్కసారిగా నిప్పంటుకుంది. క్షణాల వ్యవధిలో పందిళ్లకు మొత్తం మంటలు వ్యాపించాయి. భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఆలయంలోని భక్తులు భయంతో బయటకు పరుగులు తీశారు. గతంలో ఇలాంటి ఘటనలు ఎప్పుడూ జరగలేదని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ప్రస్తుతం ఫైరింజన్ ఇంకా రాకపోవడంతో స్థానికులు, భక్తులు కలిసి మంటలను అదుపుచేసేందుకు యత్నిస్తున్నారు. అయితే ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు అవకపోవడంతో భక్తులు, ఆలయ నిర్వహకులు ఊపిరిపీల్చుకున్నారు. శ్రీరామనవమి వేడుకలు జరుగుతున్న సమయంలో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేడుకల్లో ఏదో అపచారం జరగడం వల్లే ఇలా జరిగిందని గ్రామస్థులు భావిస్తున్నారు.

# 700 కి.మీ మైలురాయికి చేరుకున్న లోకేష్ పాదయాత్ర



శ్రీసత్యసాయిజిల్లా: టీడీపీ యువనేత నారాలోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతగా కొనసాగుతోంది. యువగళం పాదయాత్ర 700 కిలోమీటర్ల మైలురాయిని చేరుకుంది. గురువారం ఉదయం పెనుకొండ నియోజవర్గంలో 55వ రోజు పాదయాత్రను లోకేష్ ప్రారంభించారు. అక్కడి నుంచి కియా పరిశ్రమను పరిశీలించి... పరిశ్రమ ముందు లోకేష్ సెల్ఫీఛాలెంజ్ విసిరారు. అనంతరం పాదయాత్ర గుట్టూరు గ్రామంలోకి ప్రవేశించింది. దీంతో యువగళం ప్రభంజనమై 700 కిలోమీటర్ల మైలురాయిని గుట్టూరు గ్రామంలో పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... ఈ మైలురాయి గోరంట్ల మండలం మరియు మడకశిర ప్రాంతాల తాగు, సాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి పునాది కానుందని అన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక హంద్రీనీవా కాలువ నుంచి ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. అంతకు ముందు... కియా పరిశ్రమ ముందు లోకేష్ సెల్ఫీ చాలెంజ్ విసిరారు. అప్పటి ప్రభుత్వంలో అనేక పరిశ్రమలను తీసుకువచ్చామని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం ప్రజలకు సేవ చేసిందే తప్ప.. చేసిన అభివృద్ధి పనులను చెప్పుకోలేకపోయామని.. అందుకే ప్రజలు అలాంటి ఫలితాలు ఇచ్చారన్నారు. పాదయాత్రలో దారి వెంబడి వెళ్తుండగా ఉన్న పరిశ్రమల ముందు ఆగి లోకేష్ సెల్ఫీ తీసుకుంటూ ప్రజలకు తెలియజేస్తున్నారు. వైసీపీ సర్కార్‌ది విధ్వంస పాలన అని విమర్శించారు. అభివృద్ధి చేయాలన్న తలంపు ఏకోశాన జగన్‌కు సర్కార్‌కు లేదని అన్నారు. తాము చేసిన అభివృద్ధి ప్రత్యక్షంగా కనిపిస్తోంది. కియా పరిశ్రమ రావడం చంద్రబాబు ఘనతే అని చెప్పుకొచ్చారు. అధికారం చేపట్టిన తొలినాళ్లలో ప్రజావేదిక కూల్చివేతతో వైఎస్ జగన్ పరిపాలనను ప్రారంభించారన్నారు. అన్ని పరిశ్రమలు రాష్ట్రం నుంచి వెళ్లడమే కానీ కొత్తగా పరిశ్రమలు వచ్చిన దాఖలాలు లేవన్నారు.



# అప్పీల్ చేసుకునే స్థితిలోనే రాహుల్..!

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అనర్హత వ్యవహారం దేశవ్యాప్తంగానే గాక.. అంతర్జాతీయంగానూ చర్చనీయాంశంగా మారింది. రాహుల్ కేసును తాము గమనిస్తున్నామని ఇప్పటికే అగ్రరాజ్యం అమెరికా వెల్లడించగా.. తాజాగా జర్మనీ కూడా స్పందించింది. రాహుల్ కేసులోనూ ప్రజాస్వామ్య ప్రాథమిక సూత్రాలు వర్తిస్తాయని, తీర్పుపై ఆయన అప్పీల్ చేసుకోవచ్చని పేర్కొంది. "భారత్‌లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి జైలు శిక్ష.. ఆ తీర్పు కారణంగా ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దవ్వడం వంటి అంశాలను మేం గమనిస్తున్నాం. అయితే ఈ తీర్పుపై ఆయన అప్పీల్ చేసుకునే స్థితిలోనే ఉన్నారు. అప్పుడే ఈ తీర్పు నిలబడుతుందా.. ఏ ప్రాతిపదికన ఆయనపై అనర్హత పడింది అనేది స్పష్టమవుతుంది. ఈ కేసుకు న్యాయ స్వతంత్రత ప్రమాణాలు, ప్రజాస్వామ్య ప్రాథమిక సూత్రాలు వర్తిస్తాయని జర్మనీ భావిస్తోంది" అని ఆ దేశ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఓ మీడియా సమావేశంలో వెల్లడించారు. ఇటీవల, అమెరికా కూడా రాహుల్ 'అనర్హత' వ్యవహారంపై స్పందించిన విషయం తెలిసిందే. ఏ ప్రజాస్వామ్యానికైనా.. చట్ట నిబంధనలను గౌరవించడం, న్యాయ స్వతంత్రత మూల స్తంభాల్లాంటివని అగ్రరాజ్యం అభిప్రాయం వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేసే అంశంలో భారత్‌తో కలిసి పనిచేసేందుకు కట్టుబడి ఉన్నట్లు వెల్లడించింది.

ప్రధాని మోదీ ఇంటి పేరును కించపర్చారన్న కేసులో ఇటీవల రాహుల్ గాంధీకి సూరత్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ తీర్పు వెలువడిన 24 గంటల్లోపే ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం.. రాహుల్‌పై అనర్హత వేటు వేస్తూ లోక్‌సభ సచివాలయం నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే ఈ తీర్పుపై ఎగువ కోర్టులో సవాల్ చేసేందుకు ఆ పార్టీ న్యాయ నిపుణులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. దీనికి సంబంధించిన పిటిషన్‌ను వారు తయారు చేస్తున్నట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో సూరత్ సెషన్స్ కోర్టులో ఈ పిటిషన్ దాఖలయ్యే అవకాశముందని తెలుస్తోంది.



## రైల్వేగేటును దాటి ట్రాక్‌పైకి వచ్చిన దుండగులు..

# బొలెరోను ఢీకొన్న దురంతో ఎక్స్‌ప్రెస్

భీమడోలు: ఏలూరు జిల్లా భీమడోలు వద్ద బొలెరో వాహనాన్ని దురంతో ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. రైలు సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. గురువారం వేకువజామున సుమారు 3 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. దీంతో 6 గంటలకు పైగా రైలు నిలిచిపోయింది. ఆ తర్వాత విశాఖకు బయల్దేరి వెళ్లింది.

దురంతో ఎక్స్‌ప్రెస్ వస్తుండటంతో భీమడోలు జంక్షన్ వద్ద రైల్వే గేటును సిబ్బంది వేశారు. అదే సమయంలో బొలెరోలో వచ్చిన కొంతమంది వ్యక్తులు వాహనంతో రైల్వే గేటును ఢీకొట్టి వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆ వాహనం రైల్వే ట్రాక్‌పైకి వచ్చింది. అదే సమయంలో దురంతో ఎక్స్‌ప్రెస్ సమీపించడంతో సదరు వ్యక్తులు బొలెరో వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయారు. రైలు ఢీకొనడంతో ఆ వాహనం ధ్వంసమైంది. రైలు ఇంజిన్ ముందు భాగం దెబ్బతినడంతో సిబ్బంది మరో ఇంజిన్‌ను అమర్చారు. దురంతో ఎక్స్‌ప్రెస్ నిలిచిపోవడంతో అందులోని ప్రయాణికులు కొందరు ప్రత్యామ్నాయ మార్గాల్లో బయల్దేరి వెళ్లారు. ఈ ఘటనపై రైల్వేపోలీసులు విచారణ చేపట్టారు. బొలెరో వాహనంలో వచ్చినవాళ్లు దొంగలా? పారిపోయే క్రమంలో గేటును ఢీకొట్టారా? లేదా మరేదైనా కారణమా? అనే కోణంలో రైల్వే పోలీసులు విచారణ చేపట్టారు. దుండగుల కోసం గాలింపు చేపట్టారు.



# వైకాపా సర్కారు ఒక్క పరిశ్రమనైనా చూపగలదా..?

శ్రీసత్యసాయి జిల్లా: టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర 55వ రోజుకు చేరుకుంది. గురువారం ఉదయం పెనుగొండలో లోకేష్ పాదయాత్రను ప్రారంభించారు. పాదయాత్ర చేస్తూ కియా పరిశ్రమ వద్దకు చేరుకుని ఆ పరిశ్రమను యువనేత పరిశీలించారు. ఈ సందర్భంగా కియా పరిశ్రమ ముందు లోకేష్ సెల్ఫీ చాలెంజ్ విసిరారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో చాలా పరిశ్రమలు వచ్చాయని అన్నారు. ఈ పరిశ్రమలను ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోయామని అందుకే ప్రజలు తమకు ఓటు వేయలేదన్నారు. అయితే ఇప్పుడు ఇవన్నీ సెల్ఫీరూపంలో ప్రజల ముందు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కియా పరిశ్రమ ముందు లోకేష్ సెల్ఫీ చాలెంజ్ విసిరారు. అప్పటి ప్రభుత్వంలో అనేక పరిశ్రమలను తీసుకువచ్చామని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం ప్రజలకు సేవ చేసిందే తప్ప.. చేసిన అభివృద్ధి పనులను చెప్పుకోలేకపోయామని.. అందుకే ప్రజలు అలాంటి ఫలితాలు ఇచ్చారన్నారు. పాదయాత్రలో దారి వెంబడి వెళ్తుండగా ఉన్న పరిశ్రమల ముందు ఆగి లోకేష్ సెల్ఫీ తీసుకుంటూ ప్రజలకు తెలియజేస్తున్నారు. వైసీపీ సర్కార్‌ది విధ్వంస పాలన అని విమర్శించారు. అభివృద్ధి చేయాలన్న తలంపు ఏకోశాన జగన్‌కు సర్కార్‌కు లేదని అన్నారు. తాము చేసిన అభివృద్ధి ప్రత్యక్షంగా కనిపిస్తోంది. కియా పరిశ్రమ రావడం చంద్రబాబు ఘనతే అని చెప్పుకొచ్చారు. అధికారం చేపట్టిన తొలినాళ్లలో ప్రజావేదిక కూల్చివేతతో వైఎస్ జగన్ పరిపాలనను ప్రారంభించారన్నారు. అన్ని పరిశ్రమలు రాష్ట్రం నుంచి వెళ్లడమే కానీ కొత్తగా పరిశ్రమలు వచ్చిన దాఖలాలు లేవన్నారు. ఇటీవల జరిగిన జీ20 సదస్సుకు కూడా 13లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని చెప్పుకున్నారని... విదేశాల నుంచి ఎంవోయూలు కుదర్చుకున్నారని గొప్పలు చెప్పారన్నారు.

అయితే స్వరాష్ట్రం నుంచి వచ్చిన వారే తూతూ మంత్రంగా ఎంవోయూలు కుదర్చుకున్నారే తప్ప... ఆ పరిశ్రమలు వచ్చే అవకాశం లేదని అంతా చెప్పుకుంటున్నారని లోకేష్ వ్యాఖ్యలు చేశారు.

# జగన్ మంకుపట్టు వీడాలన్న సీపీఐ నేత



అమరావతి: అమరావతి రాజధాని అంశంపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంకుపట్టు వీడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. అమరావతి రాజధాని ఉద్యమం 1200 రోజులకు చేరుకుని, చరిత్రలో కనివినీ ఎరుగని ఉద్యమమైందని తెలిపారు. అమరావతినే రాజధానిగా అభివృద్ధి పరచాలని హైకోర్టు చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం లెక్కచేయకుండా సుప్రీంకోర్టుకెక్కిందని మండిపడ్డారు. సుప్రీంకోర్టులో కూడా జగన్ సర్కారుకు అనుకూలంగా స్టే ఇవ్వలేదన్నారు. తాడేపల్లిలో ఇల్లు కట్టుకున్న ఏకైక నేతగా జగన్మోహన్ రెడ్డి గత ఎన్నికల్లో ప్రజల్ని మభ్యపెట్టారని విమర్శించారు. అధికారంలోకి రాగానే మాట మార్చి, మడం తిప్పి, మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. ఉగాది తదుపరి విశాఖ నుంచి పాలన సాగిస్తామన్న జగన్‌కు ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విశాఖలో చుక్కెదురయిందని అన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా విజ్ఞత ప్రదర్శించి అమరావతినే రాజధానిగా కొనసాగిస్తున్నట్లు స్పష్టమైన ప్రకటన చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

# వైసీపీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు.. ఉద్రిక్తత



నెల్లూరు: కొత్తూరు మండలం అంబాపురంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. నెల్లూరు సిటీ వైసీపీ ఎమ్మెల్యే అనిల్?కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో ఉద్రిక్తతకు దారితీసింది. డీఎస్పీతో సహా భారీగా పోలీసు బలగాలు మోహరించారు. సర్వే నం. 1/1లో అక్రమంగా వేసిన గుడిసెలను తొలగించడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. దళితులు వేసుకున్న 300 గుడిసెలను అధికారులు తొలగించారు. గుడిసెలు వేసిన ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీ నుంచి బయటికి వెళ్లడం వల్ల నెల్లూరు జిల్లాలో వైసీపీకి ఊడిందేమీ లేదు. 2024 ఎన్నికల్లో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డికి ఓటమి తప్పదు.

ఈ ముగ్గురిలో ఏ ఒక్కరు గెలిచినా తాను మళ్లీ నెల్లూరులో అడుగుపెట్టను. ఒకవేళ అదే జరిగితే తన రాజకీయ జీవితానికి ఫుల్ స్టాప్ పెట్టేసుకుంటానన్నారు. ఈ విషయంపై తన దగ్గరికి ఎవరైనా రండి కావాలంటే బాండ్ పేపరు మీద రాసి సంతకాలు పెట్టుకుందామని, తాను గెలిచి అసెంబ్లీకి వస్తే.. మీరు రాజకీయాల నుంచి వెళ్లిపోతారా. 2024 ఎన్నికల్లో ఎవరు అసెంబ్లీకి వస్తారో తేల్చు తేల్చుకుందాం' అని అనిల్ సవాల్ విసిరారు.

## ప్రణీత.. క్యాజువల్ డ్రెస్లోనూ మెరుపులే..

టాలీవుడ్ గ్లామరస్ హీరోయిన్ ప్రణీత సుభాష్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్గా ఉండే ఈ బ్యూటీ వరుసగా తన ఫొటోషూట్స్తో అభిమానులను ఖుషీ చేస్తుంటుంది. బావ చిత్రంతో ఈ కన్నడ సోయగం తెలుగు ఆడియెన్స్కు చాలా దగ్గరైంది. మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ చిత్రంలో తన అందం అభినయంతో ఆడియెన్స్ను కట్టిపడేసింది. దీంతో టాలీవుడ్ నుంచి ఈ ముద్దుగుమ్మకు వరుస ఆఫర్లు క్యూ కట్టాయి అప్పటి నుంచి తెలుగు ప్రేక్షకులను అలరిస్తూ వస్తోంది. అలా స్టార్ హీరోల సరసన నటించి స్పెషల్ ఇమేజ్ను సొంతం చేసుకుంది. హీరోయిన్గా తక్కువ చిత్రాల్లోనే నటించినా తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చోటు సంపాదించుకుంది. అత్తారింటికి దారేది పాండవులు పాండవులు తుమ్మెద రభస బ్రహ్మోత్సవం హలో గురు ప్రేమకోసమే వంటి చిత్రాల్లో సెకండ్ హీరోయిన్గా అలరించింది. చివరిగా ఎన్టీఆర్



కథానాయకుడులోనూ మెరిసింది. ప్రస్తుతం కన్నడ హిందీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంటోంది. మరోవైపు సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్గా ఉంటూ బ్యాక్ టు బ్యాక్ ఫొటోషూట్స్తో అదిరిపోయే అవుట్ ఫిట్లలో ఫ్యాన్స్తో పాటు నెటిజన్లను ఫిదా చేస్తోంది. సినిమాల అప్డేట్స్ ఎక్కువగా ఇవ్వకున్నా.. తన వ్యక్తిగత విషయాలను మాత్రం అభిమానులతో ఎప్పటికప్పుడు పంచుకుంటూ ఉంటుంది. అయితే తాజాగా క్యాజువల్ డ్రెస్లో కనిపించి మరోసారి యూత్ హృదయాలను కొల్లగొట్టింది. లైట్ గ్రీన్ ట్రాన్స్ ఫరెంట్ షర్ట్ వైట్ పాంట్లో కనిపించి ఆకట్టుకుంది. తన పోజులతో మతిపోగొట్టింది. ఇది చూసిన నెటిజన్లు క్రేజీగా కామెంట్లు పెడుతున్నారు. కాగా కొంతకాలం క్రితం వివాహ బంధంలో అడుగుపెట్టిన ఈ బ్యూటీ చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉంటోంది. పెళ్లి ప్రెగ్నెన్సీ కారణంగా కాస్త బ్రేక్ వచ్చింది. 2021లో వ్యాపార వేత్త నితిన్ రాజును ప్రేమించి పెళ్లి చేసుకుంది. 2022 జూన్ 10న బెంగళూరులో పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చి తల్లిగా ప్రమోషన్ పొందింది. కానీ సోషల్మీడియాలో మాత్రం యాక్టివ్గా ఉంటూ అభిమానులు అలరిస్తోంది.

## ఎద అందాలతో హాట్ గా మతిపోగొడుతున్న నభా నటేష్

సౌత్ ఇండియా హాట్ బ్యూటీ నభా నటేష్ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఈ అమ్మడు కన్నడ నాట హీరోయిన్ గా కెరియర్ స్టార్ట్ చేసి తరువాత తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ అమ్మడు సుదీర్ బాబు హీరోగా వచ్చిన నన్ను దోచుకుందువటే సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. తరువాత వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం లేకుండా వరుసగా సాయి ధరమ్ తేజ్ బెల్లంకొండ శ్రీనివాస్ నితిన్ కి జోడీగా సినిమాలలో నటించింది. అయితే ఈ బ్యూటీకి తెలుగులో అవకాశాలు భాగానే లభించిన అనుకున్న సక్సెస్ మాత్రం రాలేదు. దీంతో అవకాశాలు తగ్గిపోయాయి. అయితే ఆ మధ్యకాలంలో ఓ ప్రమాదం కారణంగా కొన్ని నెలల పాటు ఆమె కంప్లీట్ గా బెడ్ కె పరిమితం అయ్యింది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా సోషల్ మీడియాలో తెలియజేసింది. ఇక తన చేతికి



తగిలిన గాయాన్ని కూడా చూపించింది. అయితే ఇప్పుడు కోలుకొని మునుపటి అందం సొంతం చేసుకోవడంతో తిరిగి అవకాశాల వేటలో పడింది. ఫోటోషూట్ లతో హీట్ పెంచుతుంది. అలాగే తన అందాలతో దర్శకులని టెంప్ట్ చేసే ప్రయత్నం చేస్తుంది. తాజాగా ఈ అమ్మడు హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డుల ఈవెంట్ లో పాల్గొనడానికి వచ్చింది. ఈ సందర్భంగా ఆమె కాస్ట్యూమ్స్ స్టైలిష్ గా ఉంటూనే అందాలు ఎంత వరకు చూపించాలో అంత వరకు కనిపించే విధంగా ఉంది. ఈ స్టైలిష్ షూట్ లో నభా ఎద అందాలతో చూపిస్తూ చూపరుల మతి పోగొట్టింది. సరైన గ్లామర్ రోల్స్ పడితే నభా నటేష్ ని ఆపడం కష్టం అనే మాట వినిపించింది. అయితే టాలీవుడ్ దర్శకులు మాత్రం నభా నటేష్ అందాన్ని సరైన విధంగా ప్రేక్షకులకి కనువిందు చేసే స్థాయిలో చూపించలేదనే చెప్పాలి. అయితే నభా ఇన్స్టాగ్రామ్ లో మాత్రం నభా అందాలని తనివితీరా ఆశ్వాదించడానికి కావాల్సినన్ని హాట్ ఫోటోలు ఉంటాయి. ఆ ఫోటోలని చూడాలంటే మీరు కూడా ఆమె ఇన్స్టాగ్రామ్ ఫలోవర్స్ గా మారిపోవాల్సిందే.




# క్యూట్ పప్పీస్ తో ప్రభాస్ క్యూటీ



మహేష్ బాబు '1 నేనొక్కడినే' సినిమా తో హీరోయన్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ క్రితి సనన్. తెలుగు లో ఈ అమ్మడు మొదటి సినిమా తో ఆశించిన స్థాయిలో గుర్తింపు దక్కించుకోలేక పోయింది. ఆ సినిమా ఫ్లాప్ అవ్వడంతో కృతి సనన్ బాలీవుడ్ లో సినిమాల వైపు అడుగులు వేసింది. ప్రస్తుతం బాలీవుడ్ లో మోస్ట్ వాంటెడ్.. క్రేజీ హీరోయిన్ గా కృతి సనన్ దూసుకు పోతుంది. హీరోయిన్ గా ఈ అమ్మడు ఏడాదికి మూడు నాలుగు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ ఏడాది ఈమె నటించిన నాలుగు అయిదు సినిమాలు విడుదల అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. హీరోయిన్ గా ఇంత బిజీగా ఉన్నా కూడా సోషల్ మీడియాలో రెగ్యులర్ గా హాట్ పొటోలు షేర్ చేస్తూ సందడి చేస్తూనే ఉంటుంది. ఇన్ స్టా లో ఈ అమ్మడి యొక్క ఫాలోవర్స్ సంఖ్య 52 మిలియన్స్ పైనే. రెగ్యులర్ గా తన ఫాలోవర్స్ కోసం ఈ అమ్మడు హాట్ అందాల ఆరబోతతో పాటు అప్పుడప్పుడు ఇలాంటి క్యూట్ ఫొటోలు షేర్ చేస్తోంది. త్వరలో ఈ అమ్మడు ప్రభాస్ తో కలిసి ఆదిపురుష్ సినిమాతో రాబోతున్న విషయం తెల్సిందే. తాజాగా ఈ అమ్మడు క్యూట్ పప్పీస్ తో ఉన్న తన క్యూట్ ఫొటోను షేర్ చేసింది. పెద్దగా మేకప్ లేకుండా నాచురల్ స్టైల్ తో చాలా క్యూట్ గా కృతి సనన్ ఉందంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఆ మధ్య ఈ అమ్మడు ప్రభాస్ తో ప్రేమలో ఉందనే వార్తలు జోరుగా వచ్చాయి. ఇద్దరి మధ్య వ్యవహారం కాస్త ఎక్కువ దూరం వెళ్లిందని.. పెళ్లి చేసుకునేందుకు సిద్ధం అవుతున్నారు అంటూ పుకార్లు షికార్లు చేశాయి. ఆ వార్తలను కృతి సనన్ కొట్టి పారేసింది. అన్ స్టాపబుల్ షో లో బాలకృష్ణ సాక్షిగా ప్రభాస్ కూడా ఆ పుకార్లను కొట్టి పారేశాడు.

# రష్మిక.. ఇంతలా శ్రమిస్తుందా?



సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ రష్మిక ప్రస్తుతం టాప్ హీరోయిన్ గా దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. తెలుగులో పుష్ప సీక్వెల్ తో ఈ అమ్మడు మరోసారి తన సత్తా నిరూపించుకోవాలని భావిస్తుంది. ఇక హిందీలో యానిమల్ మూవీలో రణబీర్ కపూర్ కి జోడీగా నటిస్తుంది. ఆ సినిమా మీద రష్మిక చాలా హోప్స్ పెట్టుకుంది. యానిమల్ హిట్ అయితే బాలీవుడ్ లో కూడా జెండా పాతేయవచ్చని అనుకుంటుంది. ఇక రీసెంట్ గా సంక్రాంతి బరిలో వారసుడు సినిమాతో ఈ అమ్మడు ప్రేక్షకుల ముందుకి వచ్చింది. ఇదిలా ఉంటే కోలీవుడ్ లో కొన్ని పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ చర్చల దశలో ఉన్నాయి. ఇక రష్మిక ఎంత హాట్ గా ఉంటుందో అంత ఫిట్ గా ఉంటుంది అనే సంగతి అందరికి తెలిసిందే. సౌత్ లో సమంత తర్వాత అంతగా ఫిట్ నెస్ మెయింటేన్ చేసేది మాత్రం కచ్చితంగా రష్మిక అని చెప్పాలి. పెర్ఫెక్ట్ లుక్ కోసం ఈమె ప్రతి రోజు కఠినమైన వ్యాయామాలు చేస్తుంది. ఉదయాన్నే వర్క్ అవుట్స్ అనేవి తన దినచర్యలో భాగంగా ఉంటాయి. ఇదిలా ఉంటే ఈ అమ్మడు తాజాగా ఇన్స్టాగ్రామ్ లో ఒక వీడియో షేర్ చేసింది. ఈ వీడియోలో జిమ్ లో ఆమె రెండు వెయిట్ బాల్స్ మధ్య బాడీని బ్యాలెన్స్ చేస్తూ పుష్ అప్స్ తీస్తుంది. నిజానికి ఇలా బాల్స్ మీద బాడీని బ్యాలెన్స్ చేయడం చిన్న విషయం అయితే కాదు. కాని రష్మిక మాత్రం ఆ ఫీట్ కూడా చేసి ఎట్రాక్ట్ చేస్తుంది. ఇక ఈ వీడియోకి అదిరిపోయే విధంగా కొన్ని లైన్స్ కూడా రాసుకొచ్చింది. ఒకప్పుడు ఒక స్ట్రాంగ్ విమెన్ ఉండేది అని నేను ఫ్యూచర్ లో నా గురుంచి చెప్పుకోవాలి. అలాంటి స్ట్రాంగ్ విమెన్ గా ఉండటానికి చేస్తున్న ప్రయత్నంలో భాగమే ఈ వీడియో. ఒక అమ్మాయిగా ప్రతి ఏదైనా నేను ఇది చూపించాలని అనుకుంటాను. అందులో భాగమే ఇది. క్రేజీగా అనిపించినా కూడా ఏదైనా ఒకటి చేయాలని అనుకుంటే కచ్చితంగా చేసి చూపించొచ్చు. అయితే దాని కోసం ఫోకస్ చేసి గట్టిగా ప్రయత్నం చేయాలి. అలా చేస్తే అనుకున్నది సాధ్యం అవుతుంది అంటూ చిన్న స్టోరీ రాసుకొచ్చింది. ఈ స్టోరీలైన్ కచ్చితంగా ప్రతి ఒక్క అమ్మాయికి స్ఫూర్తినిచ్చే విధంగా ఉందని చెప్పాలి అందుకే ఈ వీడియోకి ఏకంగా 7 లక్షల 83 వేలకి పైగా లైక్స్ వచ్చాయి.

## కొంటె చూపుతో కాటేస్తున్న బేబమ్మ

ఉప్పెన సినిమా తో హీరోయిన్ గా పాపులారిటీని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ కృతిశెట్టి. హీరోయిన్ గా మొదటి సినిమాతోనే టాలీవుడ్ లో షేక్ చేసిన ఈ అమ్మడు వరుసగా మూడు సినిమాలతో సక్సెస్ లను తన ఖాతాలో వేసుకుంది. ఆ తర్వాత కాస్త స్లో డౌన్ అయ్యింది. వరుసగా ది వారియర్ మరియు మాచర్ల నియోజకవర్గం సినిమాలు నిరాశపరచడంతో ఈమె రాబోయే సినిమాలపై ఆశలు



పెట్టుకుంది. నాగ చైతన్య ప్రస్తుతం వెంకట్ ప్రభు దర్శకత్వంలో నటిస్తున్న 'కస్టడీ' సినిమాలో హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెల్సిందే. హీరోయిన్ గా వరుసగా నటిస్తున్న ఈ ఉప్పెన క్యూట్ బ్యూటీ స్కిన్ షో విషయంలో కాస్త దూరంగానే ఉంటుంది. మొదటి నుండి కూడా పరిధి దాటి స్కిన్ షో చేయకుండానే వైరల్ అవుతోంది. ఈ అమ్మడు తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. స్కిన్ షో చేయకుండానే ఇలా కొంటె చూపులతో కవ్విస్తూ ఫొటోలకు ఫోజ్ ఇచ్చింది. క్లీ వేజ్ షో ను కాస్త హెయిర్ తో కవర్ చేసి కవ్వించేలా చూస్తున్న ఈ అమ్మడి ఫొటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇలాంటి ముద్దుగుమ్మ ముందు ముందు కచ్చితంగా స్టార్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ గా మారడం ఖాయం అనే టాక్ వినిపిస్తుంది. అందాల విందు విషయంలో ఈ అమ్మడు ఇంకో అడుగు ముందుకు వేయాలని అభిమానులు ఆశ పడుతూ ఉంటే మరి కొందరు మాత్రం ఇలా కొంటె చూపులు చాలు స్క్రిన్ షో చేసినదానికంటే ఎక్కువ మత్తెక్కిస్తోంది అంటూ సరదాగా కామెంట్స్ చేస్తున్నారు.

## బోల్డ్ లుక్ లో సెగలు రేపుతున్న బిగ్ బాస్ హారిక

దేత్తడి హారికగా యుట్యూబ్ ద్వారా తెలుగు ప్రేక్షకులకి చేరువ అయిన అందాల భామ అలేఖ్య హారిక. ఈ తెలంగాణ పిల్లకి సోషల్ మీడియాలో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ముఖ్యంగా యుట్యూబ్లో ఈమె చేసిన కంటెంట్ కి చాలా మంది ఫ్యాన్ ఉన్నారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ అమ్మడిలో మంచి డాన్సర్ కూడా ఉంది. సోషల్ మీడియా ఫేమ్ కారణంగా హారికకి బిగ్ బాస్ రియాలిటీ షోలో పాల్గొనే అవకాశం కూడా లభించింది. ఈ షో ద్వారా మరింత పాపులారిటీ సొంతం చేసుకున్న హారిక టెలివిజన్ రియాలిటీ షోలలో కూడా పాల్గొని తన డాన్స్ యాక్టింగ్ స్కిల్స్ తో అందరిని ఆకట్టుకుంది. ఇదే సమయంలో సినిమాలలో కూడా మంచి అవకాశాలనే దక్కించుకుంది. లీడ్ రోల్స్ కాకుండా మంచి ప్రాధాన్యత ఉన్న పాత్రలనే చేసింది. వరుడు కావలెను ఆదిత్యవర్మ శ్రీకారం




సినిమాలలో హారిక నటించింది. ప్రస్తుతం యుట్యూబ్ లో వెబ్ సిరీస్ లు చేస్తుంది. అలాగే ప్రైవేట్ ఆల్బమ్స్ కూడా చేస్తుంది. ఈ అమ్మడు నటనకి ఎంత మంది ఫ్యాన్స్ ఉన్నారో గ్లామర్ కి కూడా అంతే ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. తెలుగమ్మాయి అయినా కూడా ఏ మాత్రం సంకోచం లేకుండా మోడరన్ అవుట్ ఫిట్స్ లో హాట్ ఫోటోలతో సందడి చేస్తుంది. రెగ్యులర్ లో ఈమె తన బోల్డ్ లుక్ తో ఫోటోలని ఇన్స్టాగ్రామ్ లో షేర్ చేస్తుంది. ట్రెడిషనల్ అండ్ బోల్డ్ లుక్ ఏదైనా కాని హారికకి కరెక్ట్ గా సెట్ అవుతుంది. తాజాగా ఈ అమ్మడు జీన్ షార్ట్ బ్లాక్ టాప్ తో హాట్ అండ్ బోల్డ్ లుక్ లో దర్శనం ఇచ్చింది. ఈ లుక్ కి సంబందించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. హారికలో ఇంత గ్లామర్ ఉందా అనుకునేలా ఆమె ఫోజులు ఇవ్వడం విశేషం. హీరోయిన్ గా ఒక్క సినిమా పడితే హారిక రేంజ్ మారిపోవడం పక్కా అని ఈమె లుక్స్ చూసిన తర్వాత కుర్రాళ్ళు మాట్లాడుకోవడం విశేషం.




భద్రాచలం: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన రాములోరి కల్యాణోత్సవం కనులపండువగా సాగింది. అభిజిత్ లగ్నంలో జగన్మాత సీతమ్మ మెడలో శ్రీరామచంద్రుడు మాంగల్య ధారణ చేశారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. దేవదేవుడికి కల్యాణాన్ని భక్తజనం కనులారా వీక్షించి పులకించింది. మిథిలా మైదానంలో కిక్కిరిసిన భక్తజనసందోహం మధ్య త్రిదండి చినజీయస్వామి సమక్షంలో అర్చకులు కల్యాణ క్రతువును పూర్తిచేశారు. భక్తుల రామనామస్మరణ మధ్య జానకమ్మను జగదభిరాముడు మనువాడారు. ఉదయం 8 గంటల నుంచి 9గంటల వరకు ప్రధానాలయంలో మూలవిరాట్‌కు సంప్రదాయబద్ధంగా కల్యాణం నిర్వహించారు. ఆ తర్వాత కల్యాణమూర్తులను ఊరేగింపుగా మిథిలా మండపానికి తీసుకువచ్చారు. అక్కడ విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కన్యావరుణ పూజలు నిర్వహించారు. సీతారాముల వారి గోత్రనామాలను పఠిస్తూ ప్రవర క్రతువును కొనసాగించారు. సీతమ్మవారికి యోక్త్రధారణ చేశారు. రాములవారికి యజ్ఞోపవీతధారణ నిర్వహించారు. అభిజిత్ లగ్నం సమీపించడంతో మధ్యాహ్నం 12గంటలకు సీతారాముల వారి శిరస్సులపై జీలకర్ర బెల్లం ఉంచి మంత్రోచ్ఛరణ చేశారు. కల్యాణ పరమార్థాన్ని వివరిస్తూ చూర్ణిక అనే వేడుక నిర్వహించారు. అనంతరం మాంగల్యధారణ అంగరంగ వైభవంగా జరిగింది.

**ధర్మం ఆకారం దాల్చితే ఆయనే శ్రీరాముడు: చినజీయర్ స్వామి :** ఈ సందర్భంగా చిన జీయర్ స్వామి మాట్లాడుతూ.. ధర్మం ఆకారం దాల్చితే ఎలా ఉంటుందో ఆయనే శ్రీరాముడని చెప్పారు. మనుషుల్లో మనిషిగా ఉండి మనకు ధర్మం నేర్పారన్నారు. ప్రజల కష్టసుఖాలను పాలకులు గుర్తిస్తే ఆ దేశం రామరాజ్యం అవుతుందని చెప్పారు. ఇది శోభకృత్ నామ సంవత్సరమని.. త్రేతా యుగంలో సీతాదేవి జన్మించిన ఏడాది ఇదేనని వివరించారు. శ్రీరామ నవమి వేడుకలకు సుమారు లక్ష మంది భక్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. 70 కౌంటర్లలో ఉచిత కల్యాణ తలంబ్రాలను పంపిణీ చేస్తున్నారు. 19 కౌంటర్లలో లడ్డూ ప్రసాదాలు అందజేస్తున్నారు.

## రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక విద్యుత్ డిమాండ్ నమోదు



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ఇవాళ అత్యధిక విద్యుత్ వినియోగించినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. గురువారం ఉదయం 11.01 నిమిషాలకు 15,497 మెగా వాట్ల విద్యుత్ (అత్యధిక పీక్ డిమాండ్) నమోదు అయ్యిందని వెల్లడించారు. మార్చి నెల ఆరంభం నుంచే 15,000 మెగా వాట్ల విద్యుత్ వినియోగం నమోదు అవుతూ వస్తోందని పేర్కొన్నారు. వేసవికాలంలో ఉష్ణోగ్రతలు అధికం కావడం, వ్యవసాయ రంగానికి విద్యుత్ వినియోగం పెరగడంతో రాష్ట్రంలో రోజురోజుకీ విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ వినియోగం అధికమవుతోంది. మొత్తం విద్యుత్ వినియోగంలో వ్యవసాయ రంగానికే 37 శాతం వాడినట్లు నమోదైంది. మొత్తం విద్యుత్ వినియోగంలో దక్షిణ భారతదేశంలో తమిళనాడు మొదటి స్థానం కాగా, రెండో స్థానంలో తెలంగాణ నిలిచింది. నిన్న 14,422 మెగా వాట్లు కాగా రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అత్యధికంగా రికార్డు స్థాయిలో గురువారం 15,497 మెగా వాట్ల విద్యుత్ డిమాండ్ నమోదు కావడం ఇదే తొలిసారి.

**డిమాండ్ పెరిగినా సరఫరాకు అంతరాయం ఉండదు: సీఎండీ ప్రభాకర్ రావు –** "ఈ ఏడాది వేసవి కాలంలో 16 వేల మెగా వాట్ల డిమాండ్ వచ్చే అవకాశం ఉంది. ఎంత డిమాండ్ వచ్చిన సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటాం.

మార్చి నెలలో 15,000 మెగా వాట్ల విద్యుత్ డిమాండ్ నమోదు అవుతోందని ముందే ఊహించాం. అందుకు సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరాకు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేశాం. రాష్ట్ర రైతాంగానికి, అన్ని రకాల వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం" అని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు తెలిపారు.

## ఏఈ పేపర్ కోసం ఇంతకు తెగించారా!.. లీకేజ్ కేసులో విస్తుపోయే అంశాలు




హైదరాబాద్: రాష్ట్రాన్ని కుదిపేస్తున్న టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజ్ కేసులో రోజు రోజుకు అనేక కొత్త విషయాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. సిట్ విచారణలో తవ్వే కొద్దీ నిజనిజాలు బయటపడుతున్నాయి. తాజాగా ఈ కేసులో విస్తుపోయే అంశాలు బయటపడ్డాయి. గురువారం ఉదయం రెండో రోజు పేపర్ లీకేజీ నిందుతులను సిట్ ప్రశ్నిస్తోంది. ఈ కేసులో నిందితుడు డాక్యానాయక్ ఏఈ పేపర్‌తో దాదాపు రూ.25లక్షలు వసూలు చేసినట్లు సిట్ గుర్తించింది. ఈ పేపర్ కోసం నీలేశ్, గోపాల్ నాయక్ రూ.13.5 లక్షలు చెల్లించారు. వీరిద్దరూ పొలం తాకట్టుపెట్టి మరీ ఇంత మొత్తంలో డబ్బును డాక్యాకు అప్పజెప్పి పేపర్‌ను కొనుగోలు చేశారు. అలాగే రాజేందర్ రూ.5 లక్షలు, ప్రశాంత్ రూ.7.5 లక్షలు చెల్లించినట్లు గుర్తించారు. ఏఈ ప్రశ్నాపత్రం కోసం ప్రశాంత్ బంగారం తాకట్టు పెట్టి మరీ రూ. 7 లక్షలు తెచ్చినట్లు విచారణలో బయటపడింది. డాక్యా నాయక్ బ్యాంక్ ఖాతాలను సిట్ అధికారులు పరిశీలిస్తున్నారు. కాగా... టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై సిట్ అధికారులు చేసిన దర్యాప్తు ప్రకారం ఇప్పటి వరకు ఏఈ పేపర్లు 12 మందికి, గ్రూప్–1 పేపర్లు ఐదుగురికి లీకైనట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిసింది. ఇప్పటి వరకు అరెస్టుల సంఖ్య 15కు చేరింది. న్యూజిలాండ్‌లో ఉన్న రాజశేఖర్‌రెడ్డి బావ ప్రశాంత్‌రెడ్డితో కలిసి నిందితుల సంఖ్య 16కు చేరుకుంది. లీకేజీ విషయం టీఎస్‌పీఎస్సీలో ఇంకా ఎంతమంది ఉద్యోగులకు తెలుసన్న కోణంలో సిట్ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. కాగా, ఏఈ పేపర్ లీకేజీకి సంబంధించిన నలుగురు నిందితుల కస్టడీ మంగళవారంతో ముగిసిన సంగతి తెలిసిందే.


వారిని విచారించిన క్రమంలో పలు ఆసక్తికర విషయాలు తెలిసినట్లు సమాచారం. పేపర్‌ను కొన్న వారంతా అప్పులు చేసి, ఆస్తులు కుదువ పెట్టి.. రేణుక భర్త ధాక్యా నాయక్, ఆమె తమ్ముడు రాజేశ్వర్‌కు డబ్బులిచ్చామని చెప్పినట్లు తెలిసింది.

## రెచ్చగొట్టే వ్యాఖ్యలు.. రాజాసింగ్‌పై ముంబైలో కేసు నమోదు




హైదరాబాద్: గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై ముంబైలో కేసు నమోదైంది. 2023, జనవరి 29న ముంబైలో జరిగిన బహిరంగ సభలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. విద్వేషపూరిత ప్రసంగం చేసినందుకు గాను రాజాసింగ్‌పై ఐపీసీ సెక్షన్ 153 ఏ 1(ఏ) కింద ముంబై పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. జనవరి 29న ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినందుకు గాను రాజాసింగ్‌కు హైదరాబాద్ పోలీసులు కూడా నోటీసులు ఇచ్చారు. ఓ కేసులో బెయిల్ ఇచ్చే క్రమంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దంటూ తెలంగాణ హైకోర్టు షరతు విధించిందని ఆ నోటీసులో గుర్తుచేశారు. ఈ విషయమై వివరణ ఇవ్వాలని పోలీసులు కోరారు. ముంబైలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారంటూ మంగళ్‌హట్ పోలీసులు నోటీసులు జారీ చేయడంపై రాజాసింగ్ స్పందిస్తూ ధర్మం కోసం అవసరమైతే జైలుకు వెళ్తానని చెప్పుకొచ్చారు. ఇదిలా ఉంటే పీడీయాక్ట్‌పై జైల్లో ఉన్న రాజాసింగ్‌కు 2022, నవంబర్ 9న తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. 2022 అక్టోబర్‌లో హైదరాబాద్ శిల్పారామంలో కమెడియన్ మునావర్ షోకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ షోకు అనుమతి ఇవ్వడంపై రాజాసింగ్ సోషల్ మీడియాలో ఓ వీడియోను పోస్ట్ చేశారు. ఈ వీడియో మహ్మద్ ప్రవక్తకు వ్యతిరేకంగా ఉందని ఎంఐఎం నేతలు ఆరోపించారు. పలు ముస్లిం సంఘాలు ఆందోళనలు కూడా నిర్వహించారు. రాజాసింగ్‌పై నమోదైన కేసులను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ పోలీసులు పీడీయాక్ట్‌ను నమోదు చేసి జైలుకు పంపించారు. ఆ కేసులో గతేడాది నవంబర్ 9న హైకోర్టు బెయిల్ ఇచ్చింది.

## బైక్ ఢీకొనడంతో ప్రమాదం.. దగ్ధమైన ఆర్టీసీ రాజధాని బస్సు



మునగాల: సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో ఆర్టీసీ బస్సు–ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. తెలంగాణ ఆర్టీసీకి చెందిన రాజధాని బస్సు హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఇందిరానగర్ వద్దకు చేరుకోగానే బస్సును ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ క్రమంలో బస్సు కింది భాగంలోకి బైక్ వెళ్లడంతో మంటలు చెలరేగాయి. దీంతో మంటలు బస్సుకు వ్యాపించాయి. ప్రమాదం జరగడంతో అందులోని ప్రయాణికులంతా వెంటనే కిందికి దిగిపోయారు. ఆ తర్వాత నిమిషాల వ్యవధిలోనే బస్సు పూర్తిగా దగ్ధమైంది. ద్విచక్ర వాహనదారుడు మురుగేష్ రాజు (48)కి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని సూర్యాపేట తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతిచెందాడు.




## 2014 నుంచి పొన్నంకు వరుస ఓటములు..ఈసారైనా అదృష్టం వరిస్తుందా..!?

**కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మళ్లీ యాక్టివ్ అవుతున్నారా..? ఎమ్మెల్యే వద్దు...ఎంపీగా పోటీనే ముద్దు అన్న ఆలోచన చేస్తున్నారా? పాదయాత్రలో పదే పదే పొన్నం ప్రభాకర్‌ను రేవంత్‌రెడ్డి పొగిడింది అందుకేనా ? ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పనితీరుపై పొన్నం సమీక్ష చేస్తున్నారా? అనే మరిన్ని విషయాలనులో తెలుసుకుందాం..**

**2014 నుంచి పొన్నంకు వరుస ఓటములు** : ఉమ్మడి రాష్ట్రంలో ఓ వెలుగు వెలిగిన కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌కు సొంత రాష్ట్రంలో రాజకీయంగా కాలం కలిసిరాలేదు. 2014 నుంచి ఆయన వరుసగా ఓటములను చవిచూస్తున్నారు. 2009 పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి ఎంపీగా గెలిచిన పొన్నం ప్రభాకర్ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. విభజన బిల్లు సమయంలో పెప్పర్ స్ప్రేకు గురై....తెలంగాణలో ఒక్కసారిగా మరింత ఇమేజ్ పెంచుకున్నారు. వైఎస్ రాజశేఖర్ రెండోసారి ముఖ్యమంత్రిగా గెలిచిన తర్వాత ఎంపీల ఫోరంకు పొన్నం ప్రభాకర్‌ను కన్వీనర్‌ను చేశారు. ఎంపీల ఫోరం కన్వీనర్‌గా పొన్నం బాధ్యతలు నిర్వర్తించి ఔరా అనిపించుకున్నారు. అనేక సభా వేదికల మీద పొన్నంను గులాబీబాస్ కేసీఆర్ పలుసార్లు పొగిడారు. ఇలా ఉమ్మడి రాష్ట్రంలో ఓ వెలుగు వెలిగిన పొన్నం ప్రభాకర్.. ఇప్పుడు సొంత రాష్ట్రంలో రాజకీయంగా అనేక ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నారు. ఎంపీల ఫోరం కన్వీనర్‌గా కాంగ్రెస్ హైకమాండ్ దగ్గర తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అవసరాన్ని పొన్నం ప్రభాకర్ గట్టిగా వినిపించారు. తెలంగాణ ఉద్యమతీవ్రతను వారి దృష్టికి తీసుకెళ్లారు.

**అనూహ్యంగా విజయం సాధించిన బండి సంజయ్ :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక జరిగిన తొలి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సులభంగా గెలుస్తుందనుకున్న ఎంపీ సీట్లలో కరీంనగర్ ముందు వరుసలో ఉంటుందని అంతా అనుకున్నారు. కరీంనగర్ ఎంపీగా రెండోసారి పోటీ చేసిన పొన్నం ప్రభాకర్ అనూహ్యంగా ఓటమిపాలయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో దెబ్బలు తిని, పార్లమెంట్‌లో పెప్పర్ స్ప్రేకు గురైన పొన్నంను కరీంనగర్ ప్రజలు ఓడించడం అప్పట్లో సంచలనమైంది. 2014 ఎంపీ ఎన్నికల్లో ఓడిపోయిన పొన్నం ప్రభాకర్...ఆ తర్వాత జరిగిన ముందస్తు ఎన్నికల్లో అంటే 2018లో కరీంనగర్ ఎమ్మెల్యేగా పోటీ చేసి మరో ఓటమిని చవిచూశారు. రెండుసార్లు ఓడిన సానుభూతి పని చేస్తుందని భావించిన పొన్నం ప్రభాకర్ ....2019లో ఎంపీ ఎన్నికల్లో పోటీ చేశారు. అయినా కూడా ప్రజలు పొన్నం ప్రభాకర్‌ను ఆదరించలేదు. ఆయన వైపు చూడలేదు. ఆ ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసిన బండి సంజయ్ అనూహ్యంగా విజయం సాధించారు. ఇక ముచ్చటగా మూడోసారి ఓడిన పొన్నం ప్రభాకర్ తర్వాత తీవ్ర సంతృప్తికి లోనయ్యారు. వరుస ఓటములు ఎదురైనా కాంగ్రెస్ పార్టీని వీడకుండా.. పార్టీ బలోపేతానికి శ్రమిస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీని పటిష్టం చేసే దిశగా పనిచేస్తున్నారు.

**ఈసారి ఎంపీగానే పోటీ చేయాలని యోచన :** వాయిస్: పొన్నం ప్రభాకర్ మరోసారి ఎన్నికల బరిలో నిలిచేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ ఏడాది తెలంగాణ శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే ఏడాది పార్లమెంట్‌కు ఎన్నికలు నిర్వహించనున్నారు. అయితే ఎమ్మెల్యేగా పోటీ చేసి తప్పు చేశానని భావించిన పొన్నం ప్రభాకర్.. ఈ సారి ఎంపీకే పోటీ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కరీంనగర్ అసెంబ్లీ స్థానంలో అటు బీజేపీ, ఇటు బీఆర్ఎస్ నుంచి టఫ్ ఫైట్ ఉండే అవకాశం ఉంది. దీంతో పార్లమెంట్‌కు పోటీ చేస్తేనే బాగుంటుందన్న చర్చ ఆయన అనుచరుల్లో జరుగుతోంది. అందుకే ఆయన కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో సిరిసిల్ల నుంచి హుస్నాబాద్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ప్రజలతో మమేకమై నడిచారు. ఏడు నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశాలు పెట్టుకుంటున్నారు. కరీంనగర్‌లో అటు బీజేపీ, ఇటు బీఆర్ఎస్ బలంగా ఉండడంతో కాంగ్రెస్ తీవ్ర కష్టాలు ఎదుర్కొంటోంది. అయితే ఇటీవల ఈ ఏడు నియోజకవర్గాల్లో పీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి పాదయాత్ర విజయవంతం అయింది. ఈ ఏడు నియోజకవర్గాల్లో జరిగిన సభల్లో పొన్నం ప్రభాకర్‌ను రేవంత్ రెడ్డి ఆకాశానికి ఎత్తారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి పొన్నం ఎంతో కృషి చేస్తున్నారని ప్రశంసించారు.

**ఇప్పటికే ఖరారైన కాంగ్రెస్ అభ్యర్థులు..! :** 2018లో చేసిన తప్పును మరోసారి చేయకుండా ఎంపీగా పోటీ చేస్తేనే బాగుంటుందని పొన్నం ప్రభాకర్ కూడా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్క కరీంనగర్ మినహా మిగతా ఆరు నియోజకవర్గాల్లో ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారయ్యారు. వారిని సమన్వయం చేసుకుంటూ... లోక్‌సభ ఎన్నికల నాటికి పుంజుకోవాలని పొన్నం ప్రభాకర్ భావిస్తున్నారట. వాస్తవంగా 2018 ఎన్నికల కంటే ముందే పొన్నం ప్రభాకర్‌ను గులాబీ బాస్ కేసీఆర్ బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. రాజకీయంగా ఇబ్బంది ఎదుర్కొంటున్నప్పటికీ ఆయన మాత్రం కాంగ్రెస్‌ను వీడలేదు. 2018 ఎన్నికల్లో ఓడినా... 2019లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఇక 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పొన్నం ప్రభాకర్ కరీంనగర్ నుంచే బరిలో నిలుచుంటారని ఆయన అనుచరులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం ఎంపీగా ఉన్న బండి సంజయ్ ఈ ఏడాది జరిగే ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేసే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా...కరీంనగర్ ఎంపీగా ఉన్న బండి సంజయ్....పార్టీని బలోపేతం చేస్తున్నారు. కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతూ ముందుకుసాగుతున్నారు. మొత్తానికి సిట్టింగ్ బీజేపీ ఎంపీని కాదని, బలమైన బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను పక్కన పెట్టి.. పొన్నం ప్రభాకర్‌ను జనం ఆదరిస్తారా..? పొన్నం ప్రభాకర్‌కు కనీసం ఈ సారైనా కాలం కలిసి వస్తుందా లేదో చూడాలి.

## వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు..పూజలు నిర్వహించిన మంత్రులు, ప్రజాప్రతినిధులు





మహబూబాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలు గురువారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాలను అందంగా విద్యుద్దీపాలు, పూలతో అలంకరించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహబూబాబాద్ జిల్లా కేంద్రం గాంధీ పార్క్ ( మిథిలా నగరము) వద్దగల రామ మందిరంలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవంలో రాష్ట్ర గిరిజన, స్త్రీ ,శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే శంకర్ నాయక్ దంపతులు, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి దంపతులు, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు పాల్గొని పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రి సత్యవతి రాథోడ్ స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.

వనపర్తి జిల్లా కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జరిగిన శ్రీరామనవమి ఉత్సవాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి దంపతులు పూజల్లో పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించారు.


పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం, ఖిలావనపర్తి ఆలయంలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాలకుర్తి నియోజకవర్గంలో రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పలు ఆలయాలను సతీమణి ఉషా దయాకర్ రావుతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు.

వరంగల్ జిల్లా పర్వతగిరి, మహబూబాబాద్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు మండలం మాటేడు, తొర్రూరు, నాంచారి మడూరు, వరంగల్ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం రాయపర్తి తదితర దేవాలయాల్లో కళ్యాణోత్సవాలకు మంత్రి హాజరయ్యారు.

సూర్యాపేటలోని బొడ్రాయి బజార్ లోని శ్రీ వేదాంత భజన మందిరంలో జరిగిన శ్రీరామ కళ్యాణ మహోత్సవంలో మంత్రి జగదీష్ రెడ్డి, సునీత దంపతులు పాల్గొని పట్టువస్త్రాలు , ముత్యాల తలంబ్రాలు అందజేశారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రామాలయంలో జరిగిన కళ్యాణంలో ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి పాల్గొని పూజలు చేశారు. నల్లగొండ లోని రామగిరి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం లో దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, పాలకమండలి చైర్మన్ లకు నల్లగొండ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి దంపతులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన, తలంబ్రాలు, పట్టు వస్త్రాలు, పూజా ద్రవ్యాలు భక్తిశ్రద్దలతో అందజేశారు.



## వేలాది భక్తుల నడుమ శ్రీరాముడి శోభాయాత్ర

హైదరాబాద్: ఆకాష్‌పురి మందిరం నుంచి శ్రీరాముడి శోభాయాత్ర ప్రారంభమైంది. వేలాది భక్తుల నడుమ శ్రీరాముడి శోభాయాత్ర సాగుతుంది. 1500 మంది పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. సీతారామ్‌బాగ్ నుంచి సుల్తాన్‌బజార్ వరకు 6.5 కిలోమీటర్ల మేర శోభాయాత్ర సాగనుంది. సీసీ కెమెరాల పర్యవేక్షణలో సాగునున్న శోభాయాత్రను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. శోభాయాత్ర ప్రాంతాల్లో ఆక్టోపస్, రిజర్వ్ పోలీస్ మోహరించారు. సీసీ కెమెరా నిఘా ఏర్పాటు చేశామని సౌత్ వెస్ట్ డీసీపీ కిరణ్ ఖారే తెలిపారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : VISHWANATH V, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com